# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 34 సంచిక 7

పేజీలు 40

మార్చి 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం .......................................2
శ్రీబాబూజీ ఉవాచ.................................3
అమ్మమాట...........................................5
సన్నిధిలో సంభాషణ .............................7
రాయి తేలింది! ....................................9
యోగవాశిష్ఠము .................................11
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................13
పరిప్రశ్నేన సేవయా............................14
వినవయ్య వినవయ్య మా విన్నపాలు.............. 15
గీతాధ్యయనమ్.....................................16
శ్రీకృష్ణకర్ణామృతము.............................18
హోలీ - ఉగాది ...............................20
శ్రీబాబు దివ్యవాణి ............................22
యాజమాన్యం తదితర వివరాలు............. 23
శ్రీసద్గురు దివ్యమూర్తి ప్రతిష్ఠా మహోత్సవం - నివేదిక..........24
ప్రసాద మహిమ ...............................26
సద్గురు శ్రీయాత్రా దర్శన్.......................28
మహాశివరాత్రి ..................................30
ఇంద్రద్యుమ్నుడు ..............................32
సత్సంగామృతం...................................33
హనుమద్వైభవము...............................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర..........37
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అనేజదేకం మనసో జవీయః నైనద్దేవా ఆప్నువన్ పూర్వమర్షత్ ।
తద్ధావతో అన్యాన్ అత్యేత తిష్ఠత్। తస్మిన్నపో మాతరిశ్వా దధాతి ॥
(ఈశావాశ్యోపనిషత్ 4శ్లో॥)

జీవుడు అనేక జన్మలెత్తి, అనేక రూపాలలో చలించే విషయాలతో, ఇంద్రియాలతో, కోరికలతో రాక్షస ప్రవృత్తిని కల్పించుకుని 'నేను, నేను' అని ప్రవర్తిస్తున్నాడు. యదార్థంగా 'నేను' అనే పదంలోగాని, భావంలో గాని వ్యక్తమయ్యే ఆత్మకు రూపముగాని, విషయాసక్తిగాని, క్రియగాని లేవు. ఆత్మ 'ఏకం' అంటే ఒకటే. మారనిది, చలించనిది, సర్వవ్యాపకమైనది, 'అనేజత్' అనేది దానినే వ్యక్తం చేస్తోంది.

జీవుడు చలించే తన రూపాన్ని తత్ఫలితంగా కల్గిన దుఃఖానికి కారణమైన విషయాదుల యెడల కలిగే వ్యామోహాన్ని గుర్తించగలిగితే కర్మబంధం సంసారబంధం నుండి తప్పక బయటపడగలుగుతాడు.

మనస్సులో కోరిక జనించగానే కోరిన స్థలానికి మనస్సు చేర గలుగుతుంది. మనోవేగం చాల గొప్పది. కాని సర్వవ్యాపకమైన ఆత్మ వస్తువు మనస్సుకన్న ముందే అక్కడ ఉంటున్నది. అందువలనే 'మనసో జవీయం' అని చెప్పబడినది. త్రాడును చూసిన మానవుడు 'పాము' అని భ్రాంతి చెందుతాడు.పాము అనే భ్రాంతి జనించకముందే త్రాడు ఉంది. భ్రాంతిలో పాము సత్యమనుకున్నది ప్రాతి భాసిక సత్త, దాని కన్న త్రాడు ఉండటం అనే వ్యావహారిక సత్త అధిక సత్యమైనది.

నేను తింటున్నాను, నేను చూస్తున్నాను అనే కర్మలను సంకల్పం చేసే మనస్సు సంకల్పం చేయక మునుపు, సంకల్పం చేసి క్రియ నిర్వహించిన తరువాత 'నేను ఉన్నాను' అనే ఆత్మానుభూతి ఉంది - అది పారమార్థిక సత్త.

సాధకుడు ఆత్మానుభూతిని పొందటానికి స్థిరంగా శాశ్వతంగా ఉంది. ఎప్పటికైనా జీవుడు దానిని గుర్తించటానికి ప్రమాణంగా ఉంది. దేహాలను, జన్మలను అతిక్రమించి గుర్తించక తప్పదు. దానిని సాధించటానికి ఇంద్రియాలు గాని, జగత్తుగాని ఏ ఇతర పదార్థములు గాని సహాయపడవు. పడలేవు.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహారాజ్ భక్తులకు బోధిస్తూ "భగవన్నామస్మరణ ఎంతో గొప్పది. దానిని గురించి నిన్న నేను ఏమి చెప్పానో చెప్ప"మని ప్రశ్నించారు. అక్కడ ఉన్న భక్తులెవరూ చెప్పలేక పోయారు.

శ్రీ బాబూజీ మహారాజ్ మాట్లాడుతూ "నిన్న మీరంతా శ్రద్ధగా విన్నారు కదా! శ్రవణం చేసిన దానిని ఎందుకు చెప్పలేకపోతున్నారు? బహుశ మీ మనస్సు అక్కడ నిలబడి పోయిందేమో అనుకుంటే మనస్సు దేనిమీద నిలబడిందో అది చెప్పగల్గాలి కదా అంటే మనస్సు నిలబడ లేదన్నమాట.



భగవన్నామస్మరణ ఎన్నిసార్లు చేశావు అనేది కాదు భగవన్నామముపైన మనస్సు ఎంతవరకు నిలబడింది అనేది ముఖ్యం. అంత్యకాలంలో భగవన్నామము పైన మనస్సు నిలబడినప్పడే మోక్షప్రాప్తి. అంత్యకాలంలో భగవన్నామస్మరణ చేసిన వారికి ఉత్తమగతి ప్రాప్తించవచ్చు.

సద్గురు మూర్తి ప్రసాదించిన రామనామమైనా, కృష్ణనామమైనా, శివపంచాక్షరీ అయినా, గురునామమైనా స్మరించవచ్చు. ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. అజామీళుడు మంచి సంస్కారవంతుల వంశంలో జన్మించినవాడు. కానీ దుస్సాంగత్యము వలన అతను చేయని దుష్టకార్యములేదు. అతనికి ఐదుగురు కుమారులు. అతను చేసిన అతిమంచి పని ఆఖరి కుమారునకు నారాయణ అని నామకరణం చేయడమే. అజామీళునకి వయస్సు మళ్ళింది వ్యాధి గ్రస్తుడయ్యాడు. అంత్యకాలం సమీపించింది కానీ ఆ విషయం అతనికి తెలియదు.

ఇద్దరు యమదూతలు వచ్చి ఆయన ఎదురుగా నిలబడి ఆయనమీదికి పాశం విసిరారు. అది మెడకు గట్టిగా బిగుసుకుపోయింది. అతని జన్మ సంస్కారము ఎక్కడో కాస్త మిగిలివుంది. అది అతనిని మేల్కొల్పింది. వెంటనే తన కనిష్ఠ కుమారుని ఉద్దేశించి "నారాయణా!"

ఎవరో ఇద్దరు వచ్చి నన్ను బంధిస్తున్నారు” అని కేక వేశాడు. నారాయణ స్మరణతో ఆ పాశము, యమదూతలు అదృశ్యమయ్యారు.

ఇద్దరు విష్ణుదూతలు వచ్చి అజామీళుని స్వర్గానికి రమ్మని ఆహ్వానించి తీసుకు వెళ్ళారు. చూశారా! అంత్యకాలంలో చేసిన భగవన్నామస్మరణ మీకు ఉత్తమగతిని ప్రాప్తింపచేస్తుంది. భగవన్నామస్మరణ తెలిసి చేసినా తెలియక చేసినా దాని ఫలితాన్ని పొందక తప్పదు.

సమర్థులైన గురుమూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధన చేయడం మంచిదా లేక దానిని నిర్లక్ష్యం చేసి టేప్‌రికార్డర్ ద్వారా సంకీర్తన వినటం మంచిదా! అని ప్రశ్నించిన సాధకునికి ఏమని సమాధానం చెప్పాలి?

సమర్థులైన గురువు ప్రసాదించిన లక్ష్యార్థం నీ మనస్సు నిలబడడానికి చాలదా! వేరే విధంగా మనస్సుని అన్య భావాలతో నింపుకుంటే నీ గమ్యస్థానాన్ని చేరగలవా? నీ కన్నతల్లి నీ ఆకలి తీర్చకపోతే కదా వేరొక ఆశ్రయం కోసం ప్రయత్నించేది. భగవన్నామసంకీర్తన శ్రవణం చేయటం దోషంకాదు. దాని ద్వారా బాహ్య శబ్దాలు నీ మనస్సులో ప్రవేశించకుండా నిరోధించవచ్చు. కానీ అది నీ మనస్సు నిలబడటానికి తోడ్పడదు. కానీ మనస్సు నిలిపి నామసంకీర్తన చేస్తూ కృతార్థులైనవారు ఉన్నారు. త్యాగయ్య ఆ కోవకు చెందిన మహాభక్తుడు.

## గమనిక

పశ్చిమగోదావరి జిల్లా, గుండుగొలను గ్రామంలో 9-3-2015 నుండి 11-3-2015 వరకు శ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశాలు జరుతాయి.

వివరాలకు - సెల్ నెం...

98491 34442 ; 93465 35357 ; 93965 35357

(గత సంచిక తరువాయి) - జపమాల ప్రసాద

# అమ్మ మాట

## మాయ రోగాన్ని హరించేది ఒక్క సద్గురు దేవుడే!

గురు చంద్రోదయమయ్యేంతవరకూ ఈ జీవుడు చకోరపక్షిలా వేచి తపించాల్సిందే. గురు ప్రేమ, కృప అనంతమైన సాగరం. మనం చెంబుడు ముంచుకుంటే చెంబుడే లభిస్తుంది. పెద్ద ట్యాంకు తీసుకు వెళితే ట్యాంకుడు లభిస్తుంది. లేదూ అందులోనే మనం మునిగిపోతే - ఇక తద్రూపాన్నే పొందుతాము! గీతాచార్యుడేమని చెప్పాడు?

'ప్రసాదం' అంటేనే 'అనుగ్రహం' అని. కనుక మనమా ప్రసాదదేవుడి బిడ్డలం. ఇక మనకి అనుగ్రహానికి లోటేమిటి? బాబు కరుణ అపారమైనది. ఆ అనుగ్రహ వర్షానికి మనం కామక్రోధాదులనే గొడుగు పట్టుకుని 'అయ్యో!' నా మీద వర్షం కురవటం లేదే!' అంటే తప్పెవరిది? మనం పొందిన అనుభూతి గతించిపోయేదా? మనందరం బాబు బిడ్డలం. ఇక్కడ ఆశ్రమంలో అందరూ పవిత్ర భావన కలిగిన వారే.

ఒకడు నిన్ను తిడుతున్నా నువ్వు మటుకు 'రామ, రామ' అంటూ ఉండు అనేవారు నాన్నగారు (శ్రీబాబూజీ మహరాజ్). నారదుడు అంతటివాడికి 'నా అంత భక్తుడు లేడుకదా!' అనే భావన వచ్చేసరికి ఆ నారాయణమూర్తి ఎంత నాటకం ఆడవలసి వచ్చింది! కనుక 'మాయ' అనేది మన దరికి రాకుండా నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. మనలోని అహంకార మమకారములని గురుమూర్తి పాదారవింద ద్వయానికి అర్పిస్తే, మాయ మనదరికి రాలేదు.

'బాబు' అనే ఒక్కపదమే ఆశ్రమం నుండి ప్రతిధ్వనించేది. సత్య దృష్టికి గోచరించేది 'బాబు' అనే సత్యవస్తువు. వినేశక్తి, చెప్పేశక్తి, మాధుర్యాన్ని గ్రోలేశక్తి - అంతా ఆయనదే. ఆయన రక్షణ నిరంతరం మనకి కవచమై ఉంది. మనందరం తోలు బొమ్మలమే. ఆధారం ఆత్మవస్తువు. రెపరెపలాడేవి జీవులు. ఆయనే (బాబు) అన్నారుగా - 'ఇచ్చిన మాట చెల్లించే తీరుతాను. ఇక్ష్వాకు వంశం మాది. ఆడినమాట తప్పేవాళ్ళం కాదు మేము' అని.

ఆ ధృవుడు ప్రకాశించాడు, వారూ, వీరూ ప్రకాశించారంటున్నాం. మన గురుమూర్తి ప్రకాశించటం లేదా? ఆయన వడ్డించిన విస్తరి మన

ముందు ఉంచారు. తినటం లేదు అంటే ఆ తప్పెవరిది? వాడి ఆకలి సరిగా లేదన్నమాట. జగన్మిధ్య, బ్రహ్మసత్యమని బ్రహ్మామృతాన్ని గ్రోలే ఆకలి, జగన్మిధ్య అని ఖండించేవాడి ఆకలి.

'బాబు లేరు' అని ఒక్కళ్ళు అనగలరా! ఉన్నదే ఆయన! లేనిది 'మనం'. ఆత్మ నిత్యమయినది, శాశ్వతమయినది. 'బ్రహ్మజ్ఞానికి లేదు వినాశము' అని ఆయనే చెప్పారు. ఘటం విచ్ఛిన్నమవచ్చు. ఆకాశానికి చావులేదు. ఆ బాబు ఆదరణ, ప్రేమ మనం పొందాము. ఎవరూ క్రుంగిపోనక్కర్లేదు. అందరిలోనూ ఆయన తత్వమే ప్రతిబింబిస్తోంది. ఆయన ఆదరణ, ప్రేమ, నిరంతరం స్మరించుకుంటూ, ఆచరణలో పెట్టండి. ప్లగ్గు కనెక్షన్ సరిగా ఉండేటట్లు చూసుకోండి. లూజ్ కాంటాక్ట్ ఉండకూడదు. ఆయనిచ్చిన ప్రసాదం తిన్నాంగానీ, ఆ మాధుర్యాన్ని మనస్సు ప్రేరణతో జుర్రుకోవడం చేతకావటం లేదు. అందువలన దుఃఖానికి, అశాంతికి గురవుతున్నారు.

'పాదుకలు' అంటే అర్థం బాబే చెప్పారు : పా - పాపాన్ని, దు - దుఃఖాన్ని, క - కలుషాన్ని హరించి ఆనంద స్వరూపునిగా చేసేవి అని. మనసా, వాచా, కర్మణా ఆయనని ఆశ్రయించాలి. మనసులో ఆ గురుపాదుకలని ధరించాలి. ఆయన బోధని జాగ్రత్తగా విని, గురువాజ్ఞా పాలన చేస్తే, ఆయనే అన్నీ చూసుకుంటారు. యశోద కృష్ణుని కట్టేసినట్లుగా మనం కూడా మన హృదయాలలో ఆ 'హృదయబాబు'ని బంధిస్తే అప్పుడు మనం కూడా ఆ ఆనందాన్ని పొందుతాం.

అట్టి గురుపాదుకలు అఖండ భక్తి జ్ఞానాన్ని ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# గాఢమైన విశ్వాసమే భక్తి

- శ్రీ కాళీబాబు

# సన్నిధిలో సంభాషణ - పరాశర ప్రసాద్

24-2-1985

శ్రీబాబు భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ "సత్యగురుమూర్తిని ఆశ్రయిస్తే జనన మరణ ప్రవాహాన్ని దాటటానికి కావలసిన సాధనాన్ని ఆయన అందజేస్తాడు అని మనశాస్త్రాలు, పురాణాలు, వేదాలు అన్నీ స్పష్టంగా హెచ్చరిక చేస్తున్నాయి. ఇంతమంది పండితులు ఉన్నారు కదా. అటువంటి సత్యగురువుల పేర్లు చెప్పండి.



మీరు అటువంటి మహాత్ముల పేర్లు అంత తొందర తొందరగా ఎలా చెప్పగలుగుతారు? అది మీ సబ్జెక్ట్ కాదు కదా. మీ సబ్జెక్ట్ వేరు. మీరు చదివిన చదువు మీ భుక్తికి పనికి వస్తుంది గాని, ముక్తికి కాదు. త్యాగయ్య తన సాహిత్యాన్ని ఎన్నడూ పొట్టకూటి కోసం అమ్ముకోలేదు. పోనీ పోతన ఏమన్నా ధనానికి లొంగాడా? పోతన రచించిన భాగవతం ఏ మహారాజులైనా వెలకట్టి కొనగలిగారా?

సత్యగురువులు అంటే కబీరు దాస్, రామదాసు, సదాశివ బ్రహ్మేంద్రుల వారు ఆకోవకి చెందినవారు. వారు ఎన్నడూ మీ ద్రవ్యానికి అమ్ముడు పోరు. సత్యగురువులు అంటే ఎవరండీ? ముక్తి కాంతని పొందిన వారు. మనస్సును జయించిన వారు. మనస్సు వారి ఆధీనంలో ఉంటుంది. ధీరులు జనన మరణ వలయాన్ని జయించినవారు. అటువంటి వారిని ఆశ్రయిస్తే వారు పొందిన స్థితిని మనకీ ఇవ్వగలుగుతారు.

కొంతమంది ఉంటారు. వారు సాధనలో అష్టసిద్ధులను పొంది కీర్తి వ్యామోహానికి దాసులై వారు పొందిన సిద్ధులను ప్రజలకు ప్రదర్శించి తమ గొప్పతనాన్ని చాటుకుంటారు. దానివలన వారు పొందేది

ఏమన్నా ఉందా? పోనీ అందించేదయినా ఉంటుందా? అమాయిక ప్రజలు అటువంటి వారినే నమ్ముతారు 'వేమము మంత్రం పుచ్చుకున్నామండీ' అని కొంతమంది అంటూ ఉంటారు. తనికు కడుపునిండా తినటానికి లేదు, అటువంటివాడు ఇంకా ఇతరులకు ఏం పెడతాడు చెప్పండి? తను దూరటానికి ఖాళీ లేదు, తన మెడకి ఒకడోలు కట్టుకుని బయలుదేరాడట, అలా ఉంటుంది. దీనిని అర్థం చేసుకోండి.

సత్యగురువు ప్రేమమూర్తి. ఆయన ప్రసాదించిన లక్ష్యార్థము మీద మనస్సు నిలిపితే జీవుడు జీవన్ముక్తి పొంది వాచ్యార్థంలో జీవుడు అనబడేవాడే లక్ష్యార్థంలో పరమాత్ముడు అవుతాడు" అన్నారు. "మనిషి అంటే ఎవరు? వెంకటరత్నం?" అని ప్రశ్నించి, "మనిషి అంటే ద్విపాద పశువు అని శ్రీ శంకరభగవత్పాదులవారు చెప్పారేమో! అది చెప్పవేమిటయ్యా? మరి మనీషి అంటే ఎవరు? అది కూడా చెప్పు. లక్ష్యార్థము సాధించిన వాడేమో? గుణములతో కూడి ఉన్నవాడు మనిషి. గుణములను జయించిన వాడు మనీషి. గురులక్ష్యార్థము పునర్జన్మ లేకుండా చేస్తుంది. విషయాదులు అనే విషసర్పమునకు లోను కాకుండా చేస్తుంది. జీవుడు దేనివలన ప్రకాశిస్తున్నాడో దానిని మరచిపోతున్నాడు. దానికి కారణం? చూడండి. మానవుడు తాను గుణములతో కూడి ఉంటే, నిద్రావస్థలో ఉండి స్వప్నం అనే జాగ్రదవస్థలో కలవరిస్తున్నాడు. ఇలా యథార్థంగా జరిగిన సంఘటన ఒకటి చెపుతాను.

ఒకసారి మేము ఉత్తరదేశ యాత్రకి వెళ్ళాము. యాత్రలో రైలు కుదుపుకి రైలులో పైబెర్తు నుంచి హోల్డాలు క్రిందపడింది. క్రింద బెర్తు మీద ఉన్న నలుగురు కలిసి దొంగదొంగ అని గట్టిగా అరచి 'పట్టుకోండి పట్టుకోండి' అని కేకలు వేశారు. మేమంతా అక్కడికి వెళ్ళాం. తీరా టార్చ్ లైటువేసి చూస్తే ఏముంది? అది దిండు! ఆ నలుగురు ఒకరినొకరు గుద్దుకుంటున్నారు. ఆఖరున ఉన్నవాడు చిత్తు అయిపోయాడు.

- సశేషం

# రాయి తేలింది!

- స్వామి జ్ఞానానంద

సుతీక్ష్ణముని వేకువనే స్నానం చేసి, తడివస్త్రాలు ఆరవేసి, పొడి వస్త్రాలు ధరించారు. తరువాత సాలగ్రామ పీఠాన్ని తన ముందుంచుకుని పూజకు కూర్చున్నారు. 'కాని, ఇదేమిటి? పీఠం ఖాళీగా ఉందే. రెండు సాలగ్రామాలు కనిపించటం లేదే! ఇదేం వింత?' అని ఆయన మనస్సు ఆలోచనల్లో మునిగిపోయింది. ఆశ్రమవాసుల మనస్సులు దొంగతనం అనే మాట వింటేనే తాబేలు అవయవాల మాదిరి కుంచించుకు పోతాయి. అందుచేత తన చుట్టూ ఉన్న బ్రహ్మజ్ఞానులతో సాలగ్రామం గురించిన ప్రస్తావన తేవడానికి సుతీక్ష్ణమునికి జంకు కలిగింది. సాలగ్రామాలు కనిపించకపోవటంతో ఆయనకు ఏమీ పాలుపోలేదు.

రోజులు గడుస్తున్నాయి. ఇంతలో వేసవి కాలం వచ్చింది. ఏరు దాదాపు ఎండిపోయింది. మధ్యలో బావిలా ఉన్న దిగుడు ప్రాతం నుండే నీళ్ళు తీసుకోవలసిన అగత్యం ఏర్పడింది. ఇలా ఉండగా ఒకరోజు సాయంత్రం దిగుడు ప్రాంతం నుండి నీళ్ళు తీసుకుంటున్నప్పుడు సుతీక్ష్ణ మునికి నీళ్ళల్లో ఏదో కనిపించింది. ఏమిటా అది అని చేతుల్లోకి తీసుకుని చూశాడు. ఆశ్చర్యం! పోయిన ఆయన రెండు సాలగ్రామాలు అక్కడ ప్రత్యక్షమయ్యాయి. అవి కనిపించగానే ఆయన ఆనందం మేర మీరింది. వాటిని ఆశ్రమానికి తీసుకువచ్చి అలవాటు ప్రకారం మునుపటి లాగే పూజను ప్రారంభించాడు.

ఒక రోజు పూజమందిరంలో నుంచి దబదబా పాత్రలు క్రింద పడుతున్న శబ్దం వినిపించింది. పరుగువ వెళ్ళి చూడగా, తన సాలగ్రామాలను రెండు కోతులు చెరొకటి పట్టుకుపోతుండగా చూశాడు. అంతే! వాటివెంట పరుగెత్తాడు. అవి వాటిని ఏటిలో విసిరేసి రివ్వున గెంతుతూ కనుమరుగయ్యాయి. తరువాత ఎలాగో శ్రమకోర్చి నీళ్ళల్లో వెతికి తీసుకువచ్చాడు. ఈ విధంగా చాలాసార్లు జరగటంతో ఆయనకు కోపం వచ్చింది. అయినప్పటికీ వాటికి శాపం ఇవ్వటంలో ప్రయోజనం

ఏమిటి అని ఆయనకు ఆ సమయంలో తోచలేదు. కాసేపు ఆలోచించి "ఇకపై నీళ్ళలో ఏది విసిరినా అది నీటిపై తేలుతాయి గాక!" అని ఆ రెండు కోతులకు శాపం పెట్టాడు. ఆ రోజు నుండి ఆ కోతులు ఆ సాలగ్రామాలు నీళ్ళలో వేయటం, అవి తేలటమూ, ఆయన తిరిగి వాటిని శ్రమలేకుండా తెచ్చుకోవటమూ పరిపాటి అయింది.

ఈ విధంగా సుతీక్ష్ణమునిచే శపించబడిన ఆ కోతులు మనకు పరిచయమున్నవే! రామాయణంలో మనకు తారసపడే నలుడు-నీలుడు అనే వానరాలే అవి. ఈ విషయం బ్రహ్మజ్ఞాని అయిన ఆంజనేయునికి తెలియకుండా ఉంటుందా? ఆంజనేయుడు చెప్పగానే కాలాంతరంలో లంకకు సేతువు నిర్మించేటప్పుడు అన్ని రాళ్ళను నలుడు, నీలుడు మాత్రమే నీళ్ళ ఉపరితలంపై అమర్చాలని రాముడు ఆజ్ఞాపించాడు. దాని వలనే పెద్ద పెద్ద బండరాళ్ళు సైతం నీళ్ళల్లో మునగకుండా తేలి, సులభంగా పెద్ద సేతువు నిర్మాణం జరిగింది. ఈ విధంగా సుతీక్ష్ణముని శాపం వరంగా పరిణమించింది!!



(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

ఉప శాంతి ప్రకరణము

వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునితో మరల మాటలాడటం ప్రారంభించాడు "ఉదాత్తమైన మనస్సుగల ఓ రామా! ఈ జగత్తంతా మాయా మయమని తెలుసుకో, ఈ విశ్వమంతా కేవలము ఆత్మజ్ఞాన స్వభావముతో కూడివున్నది. రాజసిక, తామసిక స్వభావముతో కూడిన వ్యక్తులు కామము లేక సోమరితనము, అజ్ఞానముతో కూడిన కర్మలు చేస్తూ, జనన, మరణములనే సుడిగుండములో చిక్కుకొంటారు. సాత్విక స్వభావముతో కూడిన మంచి వ్యక్తులు, పాము కుబుసమును విడిచిపెట్టినట్లు, లోతుగా పాతుకు పోయిన మాయను పక్కకు తోసివేస్తారు. వారెల్లప్పడూ జనన, మరణ భయానికి సుదూరంగా వుంటారు. జ్ఞానులు, మహాత్ముల యొక్క సాంగత్యముతో, శాస్త్ర పరిజ్ఞానముతో, నియమ బద్ధమైన ప్రవర్తన కలిగి, వారు అంతర్ముఖమైన దృష్టితో, వివేచనా శక్తితో, సరియైన అవగాహన కలిగి వుంటారు. "ఏది వాస్తవమో (నిత్యమో), యేది అవాస్తవమో (అనిత్యమో) గ్రహించి, వాస్తవమునకే నిలబడాలి. ఏది యిదివరకు లేదో, యేది చివర వరకు వుండదో, అదెన్నటికీ సత్యము కాదు, అనాది నుంచి వుండి, యెప్పటికీ నశించదో, అదే సత్యము లేక వాస్తవము. మనసే యీ జగత్తును సృష్టించింది".



అప్పడు శ్రీరామ ప్రభువిలా సమాధానము చెప్పాడు, "ఈ జగత్తు మనోసృజితమని నేను గట్టిగా, విశ్వసిస్తున్నాను. పూజ్యులైన గురుదేవా! మనో సృజితమైన మాయను జయించటానికి ఋజువైన మార్గాన్ని సూచించండి."

వశిష్ఠ మహర్షి యిలా సమాధానము చెప్పారు. "శాస్త్ర జ్ఞానము, వైరాగ్యము, సత్సాంగత్యము, మనసు చేత సృజింపబడ్డ మాయను నిర్మూలం చేయటానికి దోహదం చేస్తాయి. పవిత్ర హృదయులైన మహర్షులిచ్చే సూచనలు, సందేశాలు, ఆత్మ విచారణకు దోహదం చేస్తాయి. అట్టి వ్యక్తి యేది సత్యమో యేది అసత్యమో గుర్తించి, చక్కగా,

అవగాహన చేసుకొంటాడు. ఓ రామా! ఈ విశ్వమంతా విశ్వాత్మ (పరమాత్మ) యొక్క విస్తరణ మాత్రమే. ఒక వస్తువును మరొక వస్తువుకు భిన్నంగా చూసే తప్పిదాన్ని విసర్జించాలి. వున్నదంతా బ్రహ్మమే, బ్రహ్మకు భిన్నమైనది మరియొకటి లేదు 'నేను' అనేది బ్రహ్మ మాత్రమే, 'నేను', యీ విశ్వమూ భిన్నమనే భావమును కూకటి వేళ్ళతో నరికి వేయాలి.

"అనంతమైన సాగరములో ఉన్న నీటిలో భేదములేనట్లు, శాశ్వతము పరవ్యాపకమైన పరబ్రహ్మలో భిన్నత్వమునకు తావులేదు. ఉన్నదంతా ఒక్కటే అన్న నీ విశ్వాసములో పొరపాటులేదు, ద్వైతమనేది లేదని తెలుసుకో, నీవు పరబ్రహ్మమని గ్రహించు. అనేక రూపాలతో, వైవిధ్యంతో సృష్టింపబడ్డ యీ ఉపాధులకు, నిజమైన వునికిలేదు, నీవు బ్రహ్మముకంటే భిన్నము కాదని గ్రహించి, దుఃఖాన్ని పారద్రోలు. నేను నిస్సహాయ స్థితిలో వున్నానని, యెన్నడూ భావించకు, సహనము, సమతుల్యత కలిగిన మనసుతో నిశ్చలంగా వుండు.

వినోదాలు, బాధలు, పుట్టుక, చావు శీతోష్ణాలు, లాభనష్టాలు, నిందాస్తుతులు, మానావమానములు మున్నగు వన్ని, మనసు యొక్క వూహలు మాత్రమే. ఒకే వొక అత్యుత్తమమైన సూత్రము అది వొక్కటి మాత్రమే శాశ్వతముగ వుంటుంది.

భూతకాలమును గురించి కాని, భవిష్యత్తును గురించి కాని ఆలోచించకు, ప్రశాంతంగా, నిష్కామంగా, హేతుబద్ధంగా వుండాలి, అన్ని రకాల ఆశలను, ఆశయాలను విసర్జించాలి. బ్రహ్మమునందే నిలిచి, సాగరమంత, గంభీరంగా వుండి, ప్రాపంచిక వాడి, వేడి చింతల నుండి ముక్తుడయి వుండాలి. రాగ ద్వేషములకతీతంగా యెదగాలి. ప్రాపంచిక విషయాలపై తీవ్రమైన వాంఛకు వీడ్కోలు చెప్పాలి. అన్నిటి పట్లా సమదృష్టి కలిగి ప్రశాంతంగా, నిశ్చలంగా వుండాలి. నీ అంతర్గత జ్యోతితో, రత్నంలా వెలుగు, ఆత్మ జ్ఞానముపై, స్థిరమైన నిర్ణయం కలిగి వుండాలి. నీలో నీవు సంతృప్తి నొంది, కలవరపరచే ప్రాపంచిక చింతల నుండి విముక్తులు కావాలి. మానవుడు తన అంతిమ జన్మలో బ్రహ్మ జ్ఞానానుభవమును సులభంగా పొందుతాడు. అతను వొక ఋషి లక్షణాలు కలిగి, విశ్వప్రేమ, ఔదార్యము, ఘనత, సహనము, సమదృష్టి, దయ, క్షమ, మున్నగు వుదాత్త లక్షణాలను, తన అంతిమ జన్మలో పొందుతాడు.

"స్వార్థపూరిత హృదయం సాలెగూడు వంటిది
నిస్వార్థమైన హృదయం తేనెపట్టు వంటిది"

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ కార్యక్రమాలు

మార్చి 2015

5 గురు : ఫాల్గుణ పూర్ణిమ; హోలీ - శ్రీసద్గురుపాదపూజ

15 ఆది : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

18 బుధ : మాస శివరాత్రి. పావులూరు బ్రాంచిలో ఏకాహం.

20 శుక్ర : అమావాస్య

21 శని : శ్రీ మన్మథ నామ సంవత్సరాది - ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

21శని నుండి 27 శుక్ర : వరకు మౌనధ్యాన సప్తాహం

28 శని : శ్రీరామ నవమి; ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

ఏప్రియల్ 2015

4 శని : చైత్ర పౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ, చంద్రగ్రహణం.

14 మంగళ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

17 శుక్ర : మాసశివరాత్రి ; పావులూరు బ్రాంచిలో ఏకాహం.

18 శని : అమావాస్య

21 మంగళ : అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ.

23 గురు : శ్రీ శంకర జయంతి, శ్రీసద్గురు వింశతి వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'న కర్మలిప్యతే నరే' అంటే మానవుడిని కర్మ బంధించదు అని ఉపనిషత్తు హామీ ఇస్తోంది. అంతేకాదు 'నాన్యథేతోస్తి' అని కూడా ప్రతి పాదిస్తోంది. కర్మ బంధించే అవకాశమే లేదని అంటోంది. ఇదెలా సాధ్యం? జగత్తులో వ్యవహారం చేస్తూ జీవిస్తున్న మానవులు కర్మలు చేస్తారు.



చేయక మానరు. చేయక తప్పదు కూడా. కర్మలు ఆచరించే ముందు విచారణీయాంశం ధ్యేయము. ఆచరించే కర్మ దేనికోసము అనేది ప్రధానము. దానిననుసరించి కర్మ రూపము దాని ఫలము ఆధారపడి ఉంటాయి.

జగత్తు యొక్క ధ్యేయం ఈశ్వరతత్త్వం అని గ్రహించిన మానవుడు తాను జగత్తులో ఆచరించే కర్మలు వ్యావహారిక కర్మలైనా ఈశ్వర తత్త్వమును ప్రతిపాదించే విధంగా ఉండాలి. సాధన చతుష్టయం సంపాదించే విధంగా ఇంద్రియ కర్మను నిర్వహించాలి. ఇది ఆచరణ సాధ్యమా అన్న సందేహ నివృత్తి కావలసిందే. సాధకునిలో త్రిగుణాత్మక ప్రవృత్తి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో వ్యాపించి ఇంద్రియ కదలికలలో కర్మలలో తన ప్రభావాన్ని చూసి కర్మబంధాన్ని తెచ్చి పెడుతుంది.

కర్మకు సంకల్పం, క్రియ, ఫలం అనే మూడు స్థాయిలలోనూ ఈ ప్రవృత్తి ప్రభావం తప్పదు. దీనిని అధిగమించటానికి సర్వవ్యాపకమైన ఈశ్వర తత్త్వానుభూతి గుర్తించగలగాలి. అనుక్షణం ఈ జగత్తుయొక్క ధ్యేయం అంటే నీ జీవిత ధ్యేయం లేక గమ్యం స్ఫురణకి రావాలి.

దాని ద్వారా ఇంద్రియ ప్రవృత్తిని గుర్తించ గల్గిన క్షణం నిగ్రహించ గలుగుతావు. ఆ క్షణమే దేహాత్మభావన రహితమై ముక్తికి చేరువవటానికి సాధ్యపడుతోంది. అటువంటి విచారణలో ఉన్న సాధకుడు ఆచరించే కర్మ, బంధాన్ని కల్గించదు కదా!

# వినవయ్య వినవయ్య మా విన్నపాలు

- పెనుమాక నాగేశ్వరరావు

వినవయ్య వినవయ్య మా విన్నపాలు, మీ బోధలే మాకు అమ్మపాలు
చూపవయ్య చూపవయ్య దీపాలు, మీరేసిన బాటలే మాకు ఆనవాలు
దిద్దవయ్య దిద్దవయ్య మా జాతకాలు, సరిదిద్దవయ్య మా జాతకాలు
మార్చవయ్య మార్చవయ్య మా జీవితాలు, మార్చేయవయ్య మా జీవితాలు

మాపకయ్య మాపకయ్య మా జ్ఞాపకాలు, మీపైన బహుతీపి జ్ఞాపకాలు
ఎంచకయ్య ఎంచకయ్య మా నేరాలు, నేరక చేసిన నేరాలు
తీర్చవయ్య తీర్చవయ్య మా అనుమానాలు పెనుభూతాలు
పెంచవయ్య పెంచవయ్య మా నమ్మకాలు, మా అనుభవాలు
తెంచవయ్య తెంచవయ్య మా బంధాలు, భవబంధాలు

చాలునయ్య చాలునయ్య మీ నాటకాలు, చాలించవయ్య మీ నాటకాలు
వదలమయ్య వదలమయ్య మీ పాదాలు, పావన క్షేత్రాలు
వందనాలు వందనాలు వందనాలు మీకు శతకోటి వందనాలు
భక్తితోటి చేసే వందనాలు, భక్తకోటి చేసే వందనాలు



# గీతాధ్యయనమ్

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

ఈ దేహానికి కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మరియొక దేహప్రాప్తి కలుగుతుంది. ఈ విషయాన్ని గ్రహించినవాడు శోకింపడు. విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆత్మ వస్తువు నాశనం లేనిది. ఆత్మ శాశ్వతము, ఈ శరీరాలు శాశ్వతములు కావు. ఆత్మ ఒక్కటే సత్యం. ఈ ఆత్మ చంపదు, చంపబడదు.



శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి
నైనం దహతి పావకః।
న చైనం క్లేదయంత్యాపః
న శోషయతి మారుతః ॥ 2/23

'ఆత్మను ఏ శస్త్రాలు ఛేదించలేవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపలేదు. వాయువు ఆరునట్లు చేయలేదు. ఎందువలనంటే అది సర్వవ్యాపి. చలించనిది. సనాతనమైనది.'

"అర్జునా! జాతస్య ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య - పుట్టిన వాడికి మరణం తప్పదు. మరణించిన వానికి జన్మ ఉంటుంది. ఇది అనివార్యం. కనుక నీవు దుఃఖాన్ని పొందకు.

ఈ ఆత్మను కొందరు ఆశ్చర్యమైనదిగా చూస్తారు. కొందరు ఆత్మ తత్త్వాన్ని ఆశ్చర్యకరంగా వర్ణిస్తారు. మరొకరు ఆశ్చర్యంగా వింటారు. కాని ఆత్మను ఇతమిద్ధం అని తెలుసుకోలేరు.

సుఖదుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధం చేస్తే, ఏ పాపాలు అంటవు. కాని వివేకహీనులు ప్రాపంచిక భోగాలలోమునిగి, కర్మఫలాలనుఆశించి పతనమవుతున్నారు.

వేదాలు త్రిగుణయుక్త కర్మకాండలను వివరిస్తాయి. నీవు త్రిగుణాలను విడచిపెట్టు. ద్వంద్వాలను విడిచి శుద్ధ సత్వ గుణంతో కర్మను చెయ్యి. కర్మఫలాలలను విడిచిపెట్టు."

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే
మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూః
మా తే సంగోఽ_స్త్వ కర్మణి ॥ 2/47

కర్మలు చేయటానికే నీకు అధికారం ఉంది. కర్మఫలాలయందు కాదు. ఫలాపేక్ష రహితుడవై కర్మలు చెయ్యి. సమత్వ భావం చేసే దానినే యోగం అంటారు. అట్టి జ్ఞానులు కర్మఫలాలను విడిచి జనన మరణ వలయం నుండి విముక్తులు అవుతారు. అట్టివారే స్థితప్రజ్ఞులు.

అర్జునునికి సంశయం కలిగి ఇలా ప్రశ్నించాడు ...

శ్లో॥ స్థిత ప్రజ్ఞస్య కా భాషా
సమాధిస్థస్య కేశవ!
స్థిత ధీః కిం ప్రభాషేత
కిమాసీత వ్రజేత కిమ్ ॥ 2/54

'కేశవా! స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏమిటి? అతడు ఎలా సంభాషిస్తాడు? ఎలా నడచుకుంటాడు?' అని.

శ్రీభగవానుడు ఇలా సమాధానం చెప్పాడు "మనస్సులోని కోరికలు తొలగి ఆత్మసంతుష్టుడైనవాడు స్థితప్రజ్ఞుడు. దుఃఖాలలో క్రుంగనివాడు, సుఖాలలో పొంగనివాడు, ఆసక్తిని వీడినవాడు స్థితప్రజ్ఞుడు. కోరికల యందు ఆసక్తి కలిగినవాడు ఆ కోరిక తీరకపోతే, క్రోధము, క్రోధము వల్ల వ్యామోహము, వ్యామోహము వల్ల మతిభ్రంశం కలిగి జ్ఞాపకశక్తి నశించి పతనమవుతాడు. కాబట్టి సాధకుడు రాగద్వేష రహితుడై, ఇంద్రియ నియమం కలవాడై మనశ్శాంతిని పొందుతాడు. అలా కోరికలు త్యజించి మమతాహంకారాలు లేక ఉన్నవాడు పరమ శాంతిని పొందుతాడు.

ఏషా బ్రాహ్మీ స్థితి పార్థః - ఇదే బ్రాహ్మీస్థితి. అంత్యకాలంలో ఈ బ్రాహ్మీ స్థితిలో స్థిరంగా ఉన్నవాడు బ్రహ్మనిర్వాణాన్ని పొందుతాడు.

ఇంద్రియ నిగ్రహం చేతను, కామక్రోధాదులను జయించుట చేతను ఆత్మ చింతనచేతను, ఆ బ్రహ్మానుభవ స్థితి కలుగుతుంది. అదే బ్రహ్మానంద రూపమగు మోక్షము."

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

38. యావన్నమే నరదశా దశమీ దృశోఽపి
రన్ధ్రాదుదేతి తిమిరీకృత సర్వభావా
లావణ్యకేలి భవనం తవ తావదేతు
లక్ష్మ్యాః సముత్క్వణిత వేణు ముఖేన్దు బిమ్బమ్ ॥



తాత్పర్యము - కృష్ణా! నన్ను ముదిమి బట్టుకొనుటయే కాక, పైగా కన్నులు కూడా పోయి, ప్రపంచమంతా అంధకార మయం కాకముందే, లక్ష్మీ విహారస్థానమై, వేణుగానం చేసే నీ ముఖం ఒకసారి చూపించుమా!

శరీరమనే అరణ్యంలో వృద్ధాప్యమనే పెద్దపులి జొరబడి, ఇంద్రియాలనే జంతువులను వేటాడి వశపరచుకునేసరికి అవి దుర్బలమైపోయి మునుపటివలె పని చేయటం మానేస్తాయి. అయితే మనస్సుని నందనందుని సుందర మందిరంగా మలచుకున్న జ్ఞానికి, హృషీకేశుడైన ప్రభువు మనస్సుకి వినే శక్తిని, చూసే శక్తిని ప్రసాదిస్తాడు. కనుక పూర్వపు మధుర స్మృతులను తలచుకుంటూ అవి మననం చేసుకుంటూ జ్ఞానియైన సాధకుడు జీవితం సార్థకం చేసుకుంటాడు. అటువంటి జ్ఞాని యొక్క అనుభవం ఇది.........................

“తెల్లవారే సరికి నందరాజు లోగిలి నిండా జనం సందులేకుండా నిండి ఉన్నారు. చూసినవాళ్ళే చూస్తున్నారు, చూసినవాళ్ళు వెనక్కి రండి అంటే రారు. వెనుకవాళ్ళను ముందుకు పోనీయరు. మూలనున్న కదల లేని ముసలమ్మ, పాకలేని పసిపాప తప్ప ఇళ్ళల్లో ఒక్కరున్నా ఒట్టు! చెప్పిన వాళ్ళకి, చెప్పని వాళ్ళకి కూడా చెప్పిచెప్పి నందయ్య మెడ బెణికిపోయే స్థితి వస్తోంది కాని తప్పదు. ఆయన ఇల్లాలు యశోదమ్మ అలసిపోయి, కనులు మూసుకుని పడుకుని ఉంది.

ఇంత బ్రహ్మాండమైన సందడికి కారణమైన కథానాయకుడు నందయశోదల పుణ్యం అంతా పండి, లేకలేక కలిగిన మగశిశువు! ‘ఇహ నీ సంతోషం అంతా కాసింత దాచుకుని స్నానం చేసి రావయ్యా! జరుప వలసిన తతంగం అంతా జరపాలి’ అని చదువుకొన్న అయ్యలు వచ్చి కేకలు పెట్టేసరికి, అప్పటికి నందుడు తెప్పరిల్లి ముందుకు అడుగు వేస్తే అందరూ సర్దుమణిగి త్రోవ ఇచ్చారు. ఆ పండితులు ఆ పసివాడిని ‘చిరంజీవ’ అని దీవించి, నందుడు ఇచ్చిన దానాలు దక్షిణలు

మూటగట్టుకుని ఇళ్ళకి చేరేసరికి, అందరికీ ఊపిరి ఆడింది. అప్పటిదాకా ఏ వాకిట్లో చూసినా తోరణాలే, అగరు ధూపాలే, గాలికి ఎగిరే జండాలే. ఏ వీధిలో చూసినా నంద గోపాలుని చూసి వచ్చిన ఆనందంలో గోపకులంతా నేతులు, పెరుగులు, పాలు, నీళ్ళు, వెన్నలతో వసంతాలు ఆడుతున్నవారే. మరి మేమేం తక్కువ తిన్నాం. ప్రొద్దునే ఇంత మంచివార్త విన్నాం. యశోదమ్మకు చిన్న మగపిల్లాడు పుట్టాడట రండి చూసివద్దాం అని వెళ్ళిన గోపికలంతా చిన్న పాపడికి నూనెతో తలంటి, పసుపు, నూనె పెట్టి, చుట్టూతిప్పి నీళ్ళు పోసి 'హరిరక్షా!' అంటూ తొట్టెలో పడుకోబెట్టి జోలలు పాడి వచ్చారు.

మరి వాడిని ఏమని పిలవాలి అంటే ఆ సందేహం కూడా తీరింది. ఒకనాడు నెత్తిమీద పిలకపెట్టుకున్న అయ్యవారు ఒకరు నందుని ఇంటికి వచ్చారు. ఆయన్ని చూస్తూనే ఎదురెళ్ళి నందుడు భుజం మీద ఉన్న కండువాతీసి నడుముకు చుట్టుకుని సాగిలపడి మ్రొక్కి తనింట్లోకి తీసుకెళ్ళి, ఎత్తుపీటవేసి కూర్చోబెట్టి కాళ్ళుకడిగి నెత్తిన జల్లుకున్నాడు. వారేమి మాట్లాడుకున్నారో తెలియదు. కాని ఆయనగారు వెళ్ళిపోయిన కాసేపటికి నందరాజు పలికినమాటలు నీలాటిరేవులోను, రచ్చబండ దగ్గర, నాలుగు దారుల నడుమ అందరిచెవులలోను ఊదినట్లు యశోదమ్మ కడుపు పంట, ముద్దులమూట పేరు 'కృష్ణుడు' అని, ఆ పేరు భూమి ఆకాశాల నడుమ, దిక్కులన్నీ నిండి మారుమ్రోగింది. ఆ పేరు వింటే చాలు ప్రతి మనస్సు పూచిన తంగేడు అవుతుంది.

నందబాలుడు ఎలా పెరిగాడంటే తాను ఆడింది ఆట, పాడింది పాట. ఇది కాకి కాదు కోయిల అంటే, అలా అనాల్సిందే! అనకపోతే ఊరుకుంటాడా! చెప్పింది చేసి తీరతాడు. 'కాకి' అన్నవాళ్ళకి అది కోయిల గానే కనిపిస్తుంది' ఎక్కడో వేరే వైకుంఠం, విష్ణువు ఎందుకు నాయనా! నువ్వు వేసే ప్రతి అడుగూ స్వర్గం! నువ్వే ఆ నారాయణ మూర్తివి కావాలి అని అంటోంది గోపికలందరిలోకి మేటి అయిన రాధమ్మ. కృష్ణుణ్ణి చూస్తుంటే ఆ మాట నమ్మబుద్ధి అవుతుంది. అది విచిత్రం!

అలాగ అంతర్ముఖుడైన జ్ఞాని మనస్సుకి కన్ను, చెవిగా అయి ఇప్పుడు కూడా అనుభవం అవుతున్నాయి. అందుకే బృందావనంలో నీ వేణుగానం చెవిలో వినిపిస్తే అమృతం పోస్తోంది. నన్నిలా ముసలితనం చుట్టుకోకమునుపే, ప్రపంచం అంతా అంధకారమయం కాకమునుపే లక్ష్మీనివాస స్థానమై వేణుగానం చేసే నీ ముఖం నా దృష్టిపథంలో నిలబడుగాక! అని ప్రార్థిన్నాను కన్నయ్యా!" అని ప్రార్థిస్తున్నాడు భక్తుడు.

# హోలీ - ఉగాది

- రమణ ప్రసాద్

ఉగాది ముందుగా ఫాల్గుణ పౌర్ణమి (మార్చి 5) నాడు హోళీ పండుగ వచ్చింది. ఈ పండుగ ఉత్తర భారతంలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. ఇతిహాస పూర్వకంగా చూస్తే, ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకసిపుడు తన మాట వినటంలేదని, ఆ బాలుని పరిమార్చాలని ఎన్నో విధాల ప్రయత్నిస్తాడు. కొండ చరియల మీద నుండి త్రోయించాడు. ఏనుగుల చేత త్రొక్కించాడు. పాములచేత కరిపించాడు. శ్రీమన్నారాయణుడు తన భక్తునికి ఆపద రాకుండా రక్షణ చేశాడు. హిరణ్యకసిపుడు తన చెల్లెలు హోళికను ప్రహ్లాదునితోపాటు అగ్నిప్రవేశం చేయమని ఆదేశించాడు. ఆమెకు గల వరప్రభావం చేత ఆమెకు అగ్నివల్ల ఎటువంటి హానీ జరుగదు. ఆమె ప్రహ్లాదునితో అగ్ని ప్రవేశించగా, దయామయుడైన శ్రీహరి ప్రహ్లాదుని కాపాడి, దుష్టబుద్ధితో అగ్నిప్రవేశం చేసిన హోళికను దహించివేశాడు.

దానికి ప్రతీకగా ముందుగా హోళికా దహనం చేసి, ఆ తరువాత రంగులు చల్లుకుని మధుర పదార్థాలను తయారు చేసికొని, బంధుమిత్రులతో కలిసి ఆహ్లాదమైన వాతావరణంలో ఈ పండుగ చేస్తారు. ఫాల్గుణ పౌర్ణమినాడు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు ఒకరిపై ఒకరు పిచకారీతో రంగులు జల్లుకుని ఆనందించారు.

'ఫాగున్ తే జిన్ చార్ హోలీ మనారే మనా' అని మీరా వర్ణించింది. 'ఫల్గుణం వచ్చింది. హోలీ ఆడదాం. ఓ మనసా! ఈ జీవితం నాలుగు రోజుల ముచ్చటే' అని.

శ్రీ విజయనామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శ్రీమన్మథ నామ సంవత్సరం మార్చి 21న ప్రవేశిస్తోంది. ఇది తెలుగువారి తొలి పండుగ. అనంత కాల పరిమాణంలో ఇది ఏడాది. కాలమహిమను గుర్తుచేస్తుంది. కాలం దురతిక్రమం అని తెలుసుకుని ప్రతి ఉగాదిని ఈశ్వరేచ్ఛగా గుర్తించి, ఈ పండుగ జరుపుకుంటాము. ఈ ఉగాదినాడు శుభాకాంక్షలు తెలుపుకుంటాము. పంచాంగ శ్రవణం చేస్తాము. ఉగాది పచ్చడిని ముందుగా సేవిస్తాము.

అబ్దాదౌ నింబ కుసుమం శర్కరామ్లఘృతైర్యుతమ్ ।
భక్షితం పూర్వ యామేతు ప్రదాదతి సుఖం పరమ్ ॥

వేపపూత, బెల్లము, చింతపండు, నెయ్యి, మిరియాలు, ఉప్పు - ఈ ఆరు రుచులు మిళితమైన రసాయనాన్ని ఉగాది పచ్చడి అంటారు. అప్పుడే కాపుకు వచ్చిన మామిడికాయ ముక్కలు, చెఱకు ముక్కలు కూడా మిళితం చేయటం కద్దు. దానిని సేవించిన తరువాతనే ఇతర పదార్థాలు స్వీకరిస్తాము.

శ్రీకాళీవనాశ్రమంలో పంచాంగ శ్రవణం జరిగిన తరువాత భక్తులందరూ శ్రీసద్గురుపాదపూజ చేసుకుంటారు. కాలమగనంలో ఎన్ని ఒడుదుడుకులొచ్చినా శ్రీగురుదేవులను నమ్మినవారికి ఏ ఆపదరాదని, ఒకవేళ వచ్చినా అది గోరంతలో పోతుందని అందరి విశ్వాసం, అనుభవం!

## దేవుడు మానవ రూపంలో లేడా?

ఒకసారి ఒక సముద్రం మధ్యలో ఒక ఓడ మునిగిపోయింది. అతడు లంకానగర తీరానికి చేరాడు. అప్పుడు రాక్షసరాజు విభీషణుడు అక్కడ రాజ్యం ఏలుతున్నాడు. ఆ వ్యాపారిని తన దగ్గరకు తీసుకు రమ్మనమని విభీషణడు తన సేవకులను పంపించాడు. అతడిని తీసుకు రాగానే విభీషణడు పట్టరాని మహదానందంతో “ఆహా! ఇతడు అచ్చు నా రామచంద్రుడిలాగ ఉన్నాడు! అదే మానవరూపం!” అన్నాడు. ఆ వ్యాపారిని మంచి నగలతోనూ, బట్టలతోనూ అలంకరించి పూజించాడు.

శ్రీరామకృష్ణులు ఈ కథను చెప్పి “మొదటిసారి నేను ఈ కథను విన్నప్పుడు చెప్పలేని ఆనందాన్ని పొందాను. భగవంతుడే మానవ రూపంలో అవతరించి, క్రీడిస్తాడు. మట్టి ప్రతిమలోనే భగవంతుణ్ణి పూజిస్తున్నప్పుడు మానవ రూపంలో ఎందుకు పూజించకూడదు?” అన్నారు.

- శ్రీరామకృష్ణ పరమహంస

# శ్రీబాబు దివ్యవాణి

సేకరణ - మురళీ

"ఒకామెకు 25మంది సంతానం ఉన్నారు. 15మంది ఆడపిల్లలు, 10మంది మగసంతానం. వారికి ఇంతమంది అల్లుళ్ళు, కోడళ్ళు కావలసినదే కదా! దానితో సతమతమవుతూ ఉండేవారు.

కబీరుదాసు సగుణ నిర్గుణబ్రహ్మ కాని పరబ్రహ్మతత్త్వాన్ని కనుగొని ఆ స్వరూపమే తాను అయినట్టి మహానుభావుడు. ఆయన ఒకసారి అమె ఇంటి ముందుగా వెడుతూ పిండి విసురుతున్న ఆమెను చూసి అలానే చూస్తూ నిలిచి పోయాడు. తారక నామమే ఊటగా దాహం తీర్చుకునే మహాత్ముడు ఆయన. ఈ ఊటకి జన్మజన్మాంతర దాహం తీర్చే తీర్థం అంటారు. కబీర్‌కు ఆమె పిండివిసురుకుంటుంటే జాలివేసింది.



'అహంకార మమకారమనే తిరగటిలో పిండిపిండైపోతున్నారు మానవులు. మధ్యలో బురుజుని (గురువును) ఆశ్రయించి ఉన్నవాడు తరిస్తాడు. ఆ బురుజును పరమాత్మ తత్వంగా గ్రహించాలి. ఆ మానవులే పిండి అవుతున్న బియ్యం'అని కబీర్ కన్నీరు కార్చటం చూసి ఆమె ఆశ్చర్యంగా 'ఎందుకు స్వామీ అలా దుఃఖిస్తున్నారు?' అని ప్రశ్నించింది.

దానికి సమాధానంగా కబీర్ 'అమ్మా! నారాయణుని స్మరిస్తూ గురువును ఆశ్రయించిన వారికి నాశనం ఉండదు' అని ఉపదేశించారు.

అంతమంది సంతానం కలిగినదైనప్పటికీ ఆమె భక్తి స్థిరమైనది. ఆ స్వామి చెప్పినది లక్ష్యార్థంగా భావించి, ఎంతమంది పిలిచినా వినకుండా, తదేక దృష్టితో నారాయణ స్మరణ చేస్తూ, ఆ మంత్రస్వరూపమే తానైపోయింది. అంతటి తీవ్రత ప్రతీవారికి అత్యవసరం!!"

# సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1-3-2015

పబ్లిషర్

# శ్రీసద్గురు దివ్య మంగళ మూర్తి ప్రతిష్ఠా మహోత్సవం - నివేదిక

- మురళీ

హైదరాబాదు శాఖ కొరకు నూతన భవనము నిర్మించుట, ఆ భవన ప్రవేశము 17-12-2014న పూజ్యశ్రీ మాతాజీ జరిపించుట అందరికీ తెలిసిన విషయమే. ఆ నూతన భవనములో శ్రీసద్గురుదేవుల దివ్యమంగళ మూర్తి ప్రతిష్ఠ చేయాలనే సంకల్పానికి అనుగుణంగా 23-1-2015 శుక్రవారం ఉదయం 6-05ని॥లకు త్రయాహ్నిక దీక్షా సంకల్పము, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనము, ఋత్విగ్వరుణులు, పంచగవ్యప్రాశన, మండపారాధనలతో ప్రారంభం అయినది. మధ్యాహ్నం 2-30ని॥లకు అగ్ని ప్రతిష్ఠాపన, మూర్తిహోమము జరిగాయి. సాయంత్రం 6-30ని॥లకు జలాధివాసము, అనంతరం సాయంకాలపూజ, నిత్య కార్యక్రమాలు జరిగాయి.

24-1-2015 శనివారం ఉదయం ప్రతిష్ఠామూర్తికి క్షీరాధివాసం, పుష్పాధివాసం, సాయంకాలం ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం నిర్వహించారు. సాయంత్రం మూర్తిహోమం, అంగహోమం, స్పర్శ హోమం మరియు కళాహోమం నిర్వహించారు.

25-1-2015 ఆదివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహ వాచం, గర్తేనవరత్నన్యాసం యంత్రస్థాపన చేసిన అనంతరం 10.04 ని॥లకు ఎంతో వైభవంగా జరిగినది.

నూతన భవనం రెండో అంతస్థులో శ్రీరామ పరివారం, మూడవ అంతస్థులో శ్రీరాధాకృష్ణుల ప్రణవస్థిత మూర్తి, నాలుగవ అంతస్థులో శ్రీ శివ పరివారం, అయిదవ అంతస్థులో శ్రీకాళీమాత శివపరమేశ్వరుల మూర్తులను పూజ్యశ్రీ మాతాజీ ఆవిష్కరించారు.

అనంతరం హోమ పూర్ణాహుతి, సంప్రోక్షణ, కళాన్యాసం, కుంభం పోయటం, కూష్మాండచ్ఛేదన, ప్రథమ దర్శనం తిలకించి భక్తులు దివ్యమైన ఆనందాన్ని పొందారు. అనంతరం శ్రీసద్గురుదేవులకు పాదపూజ, మహాప్రసాద వినియోగంతో ప్రతిష్ఠా కార్యక్రమం ముగిసింది.

ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని 22-1-2015 నుండి 26-1-2015 వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారిచే పురాణ ప్రవచనం ఏర్పాటుచేయబడింది. దీనిలో అంతర్భాగంగా 24-1-2015 వరకు సాధుమహాత్ముల బోధామృతం ఏర్పాటుచేశారు. ప.ప.ప. శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు, ప.ప.ప శ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారు, ప.ప.ప. శ్రీ మాతా జోతిర్మయానంద భారతీవారు, శ్రీ మాతా పరావిద్యానందగిరివారు భక్తులకు తమ దివ్యబోధామృతాన్ని అందించారు.శ్రీమాతాజీవారి తమ అనుగ్రహభాషణాన్ని, ఆశీస్సులను భక్తులందరికీ అందజేశారు.

26-1-2015 సోమవారం రథసప్తమిని పురస్కరించుకుని సూర్య నమస్కారాలు, సూర్యపూజ జరిగాయి. అనంతరం సామూహిక శ్రీసద్గురుపాదపూజలు జరిగాయి. మండలదీక్ష తీసుకున్నవారిచే హోమం, పూర్ణాహుతి, దీక్షావిరమణ చేయించి, అందరికీ శ్రీమాతాజీవారి దివ్య ఆశీస్సులను అందజేశారు. శ్రీబాబూజీ మహరాజ్ దివ్యమైన అనుగ్రహంతో ప్రతిష్ఠా కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

శ్రీబాబూజీ భక్తులు అధిక సంఖ్యలో అనేక ప్రదేశాల నుండి విచ్చేసి, ఈ కార్యక్రమంలో పాల్గొని పులకాకింతులయ్యారు. వారందరికీ శ్రీవారి దివ్య ఆశీస్సులు సదా లభించుగాక.

లక్షలాది కిమ్మత్తుగల బంగారానికి ధర నిర్ణయించేటందుకు, దాని వన్నెచిన్నెలు తేల్చేటందుకు రెండు అణాల రాతిముక్క, గీటురాయి ఉపకరిస్తోంది కదా! అలాగే అఖండవ్యాపక సచ్చిదానంద పరమాత్మను తెలుసుకునేందుకు భౌతికమూ, జడమూ అయినా శుద్ధబుద్ధి ఉపకరిస్తుంది.

ఇంద్రియాలు విషయాలను పట్టుకుంటాయిగాని, తమకు అధిష్ఠానమైన ఆత్మను గ్రహించలేవు. పోలీసు దొంగను పట్టుకుంటాడు కాని, మెజస్ట్రేట్‌ను పట్టుకోలేడు కదా!

- వెంకట రమణ ప్రసాద్

# ప్రసాద మహిమ

- సుశీలా ప్రసాద

శ్రీగురు పరమేశ్వరునికి పూజ జరిగాక ఆ దేవదేవునికి నివేదన చేసిన మధుర పదార్థాలన్నీ మహాప్రసాదాలై భక్తులందరికీ వినియోగపరిచేందుకు సిద్ధంగా ఉంచబడ్డాయి 'ఇంతవరకు మనం అర్చించుకున్న శ్రీగురుమూర్తిని గురించి యిప్పుడుమనం చెప్పుకుందాం' అని ఒకరు అంటున్నవేళ ..... ఒకచీమ అక్కడికి వచ్చింది. అది భగవంతునికి అర్పించిన ప్రసాదాల సువాసనలు పసిగట్టి వాటిదగ్గర చేరింది. రెపరెపలాడుతూ చుట్టూ తిరిగి తిరిగి చూసింది. చివరికి అందులోని ఒక చిన్న తునకను తీసి నోటిలో ఉంచుకుంది అంతే... ఆ క్షణాన ఆ చీమ మైమరచి ఆనందతన్మయమైపోయింది. రవంతసేపటికి తెప్పరిల్లి పరిసరాలను పరికించి చూసింది. ముమ్ముందుగా శ్రీగురుదేవుల దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించి, తనలో నిండిన వెలుగుల సాయంతో తతరివాత దయ, ప్రేమలు కురిపిస్తున్న విశాలనయనాలను తిలకించి పులకించిపోయింది. పిమ్మట స్వామి అభయ హస్తం దాని కంటపడింది. అది భయరహిత స్థితిని పొందింది. అలాగ జ్ఞానం లభించిన ఆచీమకి అక్కడవారు వినిపిస్తున్న తీయని వాక్కులు వీనుల విందుగా వినిపించాయి.అవన్నీ అర్థం చేసుకునే శక్తి కూడా కలిగింది. ఇదంతా తన వారందరితో చెప్పాలి అనుకుంది. ఇదంతా తను రుచిచూసిన" **ప్రసాద మహిమ"** అని గ్రహించిన చీమ తనలాగే యీ అనుభవ జ్ఞానం తోటివారు కూడా పొందాలి అనుకుని తనుమోయ గలిగినంత నోటకరచుకుని ముందుకు సాగి పోయింది త్వర త్వరగా.

వెళ్ళి తన వారందర్నీ పిలవనంపింది. అన్నీ ఒకచోట కూడాక 'ఇప్పుడు మీరంతా వరసగావచ్చి నా దగ్గరున్న ప్రసాదాన్ని తీసుకోండి' అని చెప్పగానే చీమలన్నీ అలాగే చేసాయి. ప్రసాదం తీసుకోగానే అన్ని చీమలకీచెప్పలేనంత ఆనందమూ, తెలివితేటలు కలిగాయి. అప్పుడు చీమ తను చూసింది విన్నది అంతా నర్ణించి చెప్పటం మొదలు పెట్టింది.

"నేను చెప్తున్నది శ్రద్ధగావిని అర్థం చేసుకోండి. అక్కడివారు పలికిన మాటలు వింటే మనందరికీ మనం ఏమిటో తెలుస్తుంది. నేను విన్నది ఇది. చీమ మొదలు బ్రహ్మవరకు సృష్టించింది ఆ పరమేశ్వరుడైన గురుపరబ్రహ్మ పెంచి పోషించి చివరకి తనలోనే చేర్చుకుంటాడు.

సర్వమూ ఆయన దయవల్లనే కలుగుతోంది. మనందరి భారమూ తానేమోస్తూ మనకి ఏలోటు కాకుండా కాపాడుతున్నాడు. అందువలన మనం ఆతండ్రికి ఎంతో ఋణపడిఉన్నాం కనుక ఆ దైవం పాదాలను నమ్మిఉండాలి. ఏక్షణానా ఏమరక ఆదివ్యనామ స్మరణ చేస్తుండాలి. కరుణామయుడైన గురుదేవుడు అలా చేస్తున్న మనందరికి తనకెంతో దగ్గరగా తీసుకుంటాడు. అలాగా చేయని వాళ్ళని కూడా సరైన దారిలోకి మళ్ళించి తనవైపుకు తిప్పుకుంటాడు గానీ ఆలశ్యమవుతుంది అంతే.'

ఇదంత వింటున్న చీమలన్నీ బ్రహ్మానందంలో మునిగాయి. ఆ సమయంలో వాటన్నిటికీ దగ్గరలోనే ఒక వ్యక్తి కూర్చుని ఉండటం కనిపించింది. తన కెదురుగా ఒక దైవ విగ్రహంఉంది. వానికి చుట్టూ బుట్టలు బుట్టలు పూలు, గుట్టలు గుట్టలుగా ఆహారపదార్థాలు పండ్లు అన్నీ ఉన్నాయి. ఏదో చదువుతూ పూలని స్వామి పాదాల మీద జల్లుతున్నాడు. చీమలు అది చూసి 'మనం కూడా పూజ చేసుకుందాం. పూజకి కావసినపూలు తెచ్చుకుందాం పదండి' అనుకుంటూ తలోక దారిన వెళ్ళాయి.

కొద్దిసేపట్లోనే అవన్నీ చెట్లకింద రాలిన పూలరేకలను ఏరి తీసుకొచ్చాయి. వెతికి దొరికిన ఆహారపదార్థాలను మోసుకొచ్చాయి. ఆ వ్యక్తి సమీపంలోనే కూర్చుని పూలరేకులన్ని దేవుని పాదాలమీద ఉంచాయి. స్వామికి అలసట కలగకుండా తాము తెచ్చిన ఆహారాన్ని ఆయన పెదవుల చెంత ఉంచాయి, అంతలో ఆ వ్యక్తి కళ్ళు మూసుకుని ఏమిటో అంటుండటం వాటికి వినిపించింది. అవి ఆలకించినదంతా యిలా ఉంది. "ఓ దేవా!నేను కష్టపడి చెమటోడ్చిసంపాదించి కూడబెట్టిన డబ్బుతో నీకు రోజూ పూలు పళ్లు అన్నీకొనితెచ్చి పూజ చేస్తున్నాను, ఎందుకో తెలుసా! నేను పెడుతున్న ఖర్చుకు ప్రతి ఫలంగా అంతకి ఇబ్బడి ముబ్బడిగా నూరింతలు వేయింతలుగా ధనాన్ని నువ్వు నాకిస్తావని, నా సాటివారంతా నన్ను చూసి అసూయపడేటంత గొప్ప స్థితికినేను ఎదగాలి. అందరుకీ నామాట వేదవాక్కు అయ్యేట్టుగా పదవీ అధికారాలు నాకు ప్రసాదించుచాలు. నీకే మహిమ ఉంటే నా కోర్కెలు తీర్చు".

(తరువాయి భాగం 29వ పేజీలో చూడండి)

# సద్గురు శ్రీ యాత్రాదర్శన్

(గత సంచిక తరువాయి) -డా॥ సుధ

13-5-2014

ఉదయం 4-30ని॥లకు ప్రార్థన, మాతాజీ చేతులతో తీర్థం తీసుకుని ఫలహారం చేసి బస్సులో బయలుదేరాము. వజ్రేశ్వరి అమ్మవారి దర్శనం. పిండి రూపం. అమ్మవారి కాలిన స్థనములు పడిన స్థలం. శక్తి పీఠం. నాగర్‌కోట్ కాంగ్రా దేవిగా ప్రసిద్ధి చెందినది. దశమహావిద్యలలో ఒకటిగా తారాదేవిని ఉపాసిస్తారు. తారాదేవి మోక్షాన్ని ప్రసాదిస్తుంది. తరింపజేయునది. కాబట్టి 'తారా' నామము విఖ్యాతి చెందింది. 'నీల సరస్వతీ' అనే నామంతో కూడా పిలుస్తారు. విపత్తుల నుండి రక్షిస్తుంది కాబట్టి ఈమె 'ఉగ్ర తారా' రూపమును యోగులు ఆరాధిస్తారు. వశిష్ఠ మహర్షి ఉగ్రతారా ఉపాసకుడు.

చైత్ర శుద్ధ నవమి రాత్రి - తారా రాత్రిగా పిలుస్తారు.

స్థల పురాణం - జలంధర మహాత్మ్యం. కాంగ్రా అంటే ఒక కోట చెవిపై వెలిసింది. ఆ చెవి జలంధరుడనే అసురునిది. అతడు దేవతలపై యుద్ధం చేశాడు. శ్రీ మహావిష్ణువు, శివుడు కలిసి మాయోపాయంతో ఈ అసురుని వధిస్తారు. అతడి భార్య తులసి పరమ పతివ్రత. ఆమె శాపానికి భయపడి జలంధరునికి ప్రత్యక్షమై, కోరిక కోరుకోమని వరమిస్తారు. అప్పుడు జలంధరుడు 'నా శరీరాన్ని కప్పిన ఈ స్థలమంతా పవిత్రమై, దేవతలు నివసించాలి. ఆ దేవతల ఆలయాలను భక్తులు దర్శించి, అర్చించి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలి' అని కోరుకున్నాడు. పన్నెండు యోజనాల విస్తీర్ణమై ఉన్న శివాలిక్ పర్వతాలను జలంధర పీఠం అంటారు. 64 ఆలయాలు ఈ ప్రదేశంలో ఉన్నాయి. ఇవి దర్శించిన వారికి చార్‌ధామ్ దర్శించిన ఫలితం దక్కుతుంది.

వజ్రేశ్వరి నుండి గంట ప్రయాణం చేసి చాముండ అనే ఊరు చేరాము. హెూటల్‌లో బసచేసి, చాముండి అమ్మవారి ఆలయం వెళ్ళాం. అమ్మ పిండి రూపం కాకుండా, విగ్రహ రూపంలో ఉన్నది. మహాశక్తి వంతులైన చండముండ అనే అసురులు, దేవతలనే గడగడలాడించారు. లలితాదేవి తన కనుబొమ్మల మధ్య నుండి కాళికాదేవిని సృష్టించి వారిని వధింపజేసింది. చాముండను నందికేశ్వరధామ్ అని కూడా అంటారు.

బాణ గంగ ఒడ్డున ఉన్న ప్రశాంతమైన, ప్రకృతి సౌందర్య నిలయమైన దేవతా నిలయం. శంకరుడు అషుతోష్ అనే పేరుతో అమ్మవారి చెంతన ఉంటాడు.

స్థల పురాణం - ఒక భక్తునికి చాముండిదేవి కలలో కనబడి తన పిండి రూపమైన విగ్రహం పెట్టి ఆలయం నిర్మించమని, మరియు ఆ విగ్రహం బాణ గంగ వద్ద నుండి తెమ్మనమని ఆదేశించింది. అతడు ఆ విధంగానే చేశాడు. ఈ ఆలయం 700సం॥లు క్రిందట కట్టిన బహుపురాతనమైనది. ఆ భక్తుడెవరో, ఏ విధంగా ఆ విగ్రహం తెచ్చాడో ఇప్పటికీ ఎవరికీ తెలియదు.

- సశేషం

● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ●

'ప్రసాదమహిమ' 27వ పేజీ తరువాయి భాగం -

అంతా విన్న చీమలు మొహ మొహాలు చూసుకున్నాయి.తనకి కలిగిన జ్ఞానంతో చీమ తక్కిన వాటితో ఇలా అంది 'ఆ మనిషిలో స్వార్థం నిండి ఉంది. ఆశ అనే వలలో చిక్కుకున్నాడు. అందువలన సర్వశక్తి మంతుడైన పరమాత్ముని ఏమడగాలో కూడా తెలియకుండా ఉన్నాడు. ఇటువంటి అజ్ఞాని ప్రక్కన ఉంటే మనం కూడా చెడి పోతాము. అసలు అలాంటి మాటలు వినకుండాచెవులు మూసుకోవాలి లేదా అక్కడ ణ్ణించి దూరంగా వెళ్ళి పోవాలి" అనుకుని అవి ఇలా ప్రార్ధన చేశాయి.....

'ఓ గురు దేవా! నీ మాట జవదాటకుండా ఉంటే మా జన్మలన్నీ తరిస్తాయని తెలుసుకున్నాం, మాజీవితాలు నీ వరప్రసాదాలు. మాకు నువ్వు ఏర్పరచిన కర్తవ్యాలను నెరవేరుస్తూ నిన్ను ఎప్పుడూ మర్చిపోకుండా ఉండే దేహబలాన్ని మనోబలాన్ని మాకు అనుగ్రహించు, కలిసికట్టుగా జీవిస్తూ ఎవరినీద్వేషించకుండా ఉండే మంచి మనస్సులని మాకు ప్రసాదించు.'

వాటి ప్రార్ధన ఆలకించిన దేవదేవునికి ఆనందం కలిగింది. "ధన్యజీవులారా ! ముందు ముందు ఉత్తమగతినంది మహాజ్ఞానులై ప్రకాశిస్తారు" అని పలికిన గురుదేవుని అభయహస్త కిరణాలు ఆప్రాణులన్నిటిపైన ప్రసరించాయి.

"గురు సుప్రసాదంబు గొనకున్న కల్గునే ప్రతి లేని చిత్తోపరతి సుఖంబు...".

# మహాశివరాత్రి

- పరాశర ప్రసాద్

మాఘమాసంలో బహుళ చతుర్దశి భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలలో అత్యంత పుణ్యదినం, శ్రీ పార్వతీ పరమేశ్వరులిరువురికి అత్యంత ప్రీతికరమైన ఈ పర్వదినమే మహాశివరాత్రి. భక్తులంతా అభిషేకాలు, పూజలు, ఉపవాసాలు జాగరణ శివారాధనతో గడిపే పవిత్ర దినం.

భక్తులంతా పార్వతీపరమేశ్వరులను ఆరాధించుకోవటానికి అవకాశం కల్పించినట్లుగా మాఘ బహుళ చతుర్దశినాడు సృష్టి, స్థితి, కర్తలయిన బ్రహ్మ విష్ణువుల మధ్య సృష్టికార్యం గొప్పదా? లేక దాని పోషణ భారం వహించిటం గొప్పదా? అన్న విషయం మీద వాదన జరిగిన మీదట వారిరువురి మధ్య ఓంకారం ప్రతిధ్వనిస్తూ, ఒక అగ్నిజ్వాలా స్థంభం ఆవిర్భవించింది. దానిని చూసి ఇరువురు ఆశ్చర్యపోయి ఆ స్థంభం తుది మొదలు ఎవరు కనుక్కుంటారో వారే అధికులుగా నిర్ణయించుకుందా మని హంస రూపం దాల్చి బ్రహ్మ, వరాహరూపం దాల్చి విష్ణువు, పైకి ఒకరు, క్రిందకి ఒకరు ప్రయాణం అయి వెళ్ళారు. కాని వారిరువురు తుది, మొదలు తెలుసుకోలేక పోయారు.



విష్ణువు తన స్థానానికి వచ్చి బ్రహ్మకోసం నిరీక్షించసాగాడు. వెను తిరిగి వచ్చే బ్రహ్మకు ఒక మొగలి పూవు కనిపించింది. వెంటనే ఆ పువ్వును "నువ్వు ఎక్కడి నుంచి వస్తున్నావు?" అని బ్రహ్మ ప్రశ్నించాడు. మొగలి పువ్వు సమాధానం చెబుతూ "తాను స్థంభం పై భాగం నుంచి వస్తున్నాను" అని చెప్పింది. అప్పుడు బ్రహ్మగారు మొగలి పూవ్వును తాను కూడా అగ్ని జ్వాలా స్థంభం పై భాగం నుంచే వస్తున్నాననీ, ఆ విషయాన్ని విష్ణువుతో చెప్పేటప్పుడు సాక్షిగా ఉండమని కోరిన మీదట మొగలిపూవు అందుకు అంగీకరించటం జరిగింది.

బ్రహ్మ, మొగలిపూవ్వు ఇద్దరూ కలిసి విష్ణువును చేరి విషయాన్ని వివరించే ప్రయత్నంలో ఉండగా, అగ్నిజ్వాలా స్థంభం నుండి పరమేశ్వరుడు ప్రత్యక్షమై అసత్యం పలికిన బ్రహ్మదేవుని శిరస్సును ఖండిస్తాడు. అందువలననే బ్రహ్మదేవుడు చతుర్ముఖుడయ్యాడు. అంతేకాదు మొగలి పువ్వు శివార్చనకు పనికిరాదని శాపంకూడా ఇచ్చాడు. బ్రహ్మ విష్ణువులిద్దరూ కలిసి పరమేశ్వరుని విశిష్ఠతను తెలియ జేసిన రాత్రి, మహాశివరాత్రి పర్వదినంగా పరిగణింప బడుతోంది.

మహాశివరాత్రి పర్వదినాన శ్రీకాళీవనాశ్రమంలో వేకువజామునే సర్వదేవతా స్వరూపుడైన శ్రీగురుమూర్తికి బృందావనంలో లఘున్యాసపూర్వక సహితంగా అభిషేకాలతో ప్రారంభమై సద్గురుదేవులు తమ శక్తినంతా ధారపోసి ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్రఘటాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం రాత్రికి శ్రీ ఉమా రామలింగేశ్వరుల లీలా కళ్యాణ వైభవంతో ఆనాటి కార్యక్రమాలు ముగిసి భక్తులందరికీ ఆనందాన్ని కలిగిస్తాయి.



# ఇంద్రద్యుమ్నుడు - కామేశ్వరీ ప్రసాద

ఒకప్పుడు ఇంద్రద్యుమ్నుడు అనే మహారాజు నిరంతరం ఒక పర్వత గుహలో నిష్ఠగా శమదమాదిగుణ సంపన్నుడై, ఏకాగ్రతతో తన ఎదురుగా తన ఇష్టదైవమైన ఆదివిష్ణుమూర్తి విగ్రహాన్ని పెట్టుకొని, నిత్యమూ భక్తి శ్రద్ధలతో పూజిస్తూ, సర్వమూ మరచి ఏకాగ్రతో ధ్యానిస్తూ ఉండేవాడు. ఒకనాడు అగస్త్యమహర్షి ఆ మహారాజుకు దర్శనమివ్వాలని అక్కడికి వచ్చారు. కాని ఆ మహారాజు ఆ పూజావిధిలో మునిగి మహర్షి వంక కన్నెత్తైనా చూడలేదు.

అది చూసిన అగస్త్యుడు తన మనస్సులో "ప్రతి వ్యక్తి నేను జీవుడను, పరమాత్మ ఎదురుగా ఉన్నాడు అని పూజలు చేస్తారు. భక్తితో కొలుస్తారు. వరాలు అడుగుతారు. ఇంకా ఏమోమో కోరతారు. ఎప్పటికి ఆ జీవుడికి మోక్షము? మోక్షమనగా తాను ఈ శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, ఇది ఏదీకానిది ఏదైతే ఉన్నదో అదే తాను అని తెలుసుకోవడమే. మానవుడు ఇది తెలుసుకోలేక తన జీవితాన్ని వ్యర్థ పరస్తున్నాడు కదా!" అని తలస్తూ వెంటనే అగస్త్యులవారు ఆలోచించి, ఆ మహారాజుకు శాపమిచ్చారు.

ఎందుచేతనంటే పెద్దలయందు, గురువులయందు లక్ష్యము లేని వారు ముందు ముందు ఎన్నిజన్మలెత్తవలసి వస్తుందో అని. అవ్యాజ కరుణామూర్తి కనుక అగస్త్యమహర్షి ఆ మహారాజుకు మోక్షప్రాప్తి కలుగ జేయవలెననే సంకల్పంతో "గజరూపమును పొంది వెంటనే గజయోనిలో జన్మించవలసినది" అని శాపమిచ్చారు.

ఆ మాటలు విని, ఆ మహారాజు ఉలిక్కిపడి, కనులు తెరచి, మహర్షికి భయభక్తులతో నమస్కరించి, "స్వామీ! నేను మీరు వచ్చింది గమనించలేదు. పూజలో నిమగ్నమై ఉన్నాను. అంతేకాని వేరు భావన లేదు. మిమ్ములను నిర్లక్ష్యంగా చూడటం కాదు. నన్ను మన్నించండి" అని ఎన్ని విధాల ప్రార్థించినా కూడా వినకుండా అగస్త్యమహర్షి "నీకు నా శాపం అనుభవింక తప్పదు" అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.

- సశేషం

# సత్సంగామృతం

- మురళీ

(గుంటూరు శ్రీరామనామ క్షేత్రంలో శ్రీరామకోటి ఉత్సవాల సందర్భంగా 19-12-2013 గురువారం రోజున శ్రీమాతాజీ 'అమృతోపదేశములు' అనే పుస్తకావిష్కరణ చేసిన అనంతరం అందించిన బోధ.......)

గురువుల సహవాసం సామాన్యం కాదు. గురువులేని విద్య గుడ్డి విద్య. ధర్మప్రభువైన సద్గురువును ఆశ్రయించాలి. తను, మన, ధనాలను గురువుకు అర్పించాలి. గురుపాదాన్ని ఆశ్రయించాక చెప్పింది చెప్పినట్లు తు.చ. తప్పకుండా ఆచరించాలి. అప్పుడే సచ్ఛిష్యుడు అనిపించు కుంటాడు. ప్రపంచంలో ఏ ఒక్కటి మన వెంట రావటం లేదు. మన భక్తి ప్రబలమై పుష్టిస్తే, ఫలాన్ని అందించటానికి వస్తారు మహాత్ములు. శ్రీరామపిచ్చయ్య (ప్రస్తుత శ్రీరామ నామక్షేత్రం కార్యదర్శి) గారికి ఎనిమిది సంవత్సరాల వయస్సు లోనే వారి తండ్రిగారు వారికి సద్గురు దేవుల వద్ద మంత్రోపదేశం ఇప్పించారట. తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఆధ్యాత్మిక సంపదే నిజమైన సంపద. పిల్లలకు ఎన్ని ఎకరముల పొలము ఇద్దాము? ఎన్ని అంతస్థుల భవనాలు ఇద్దాము? అని కాదు ఆలోచించ వలసినది, వారికి ఎటువంటి భాగవతుల పరిచయం కలిగించాలా?అని ఆలోచించాలి. పిల్లలకు మొట్టమొదటిగా రామనామం (భగవన్నామం) పలకటము నేర్పాలి.



జ్ఞానం మనకి భిన్నంగా లేదు. శ్రీగురుదేవులు తమని ఆరూఢంగా విశ్వసించి ఉండటం వలన మనందరికి వారు ఆశ్రయాన్ని ప్రసాదించారు.

గురువుల అనుగ్రహం, అనుభూతిని పొందాలంటే ఎంతో సాధన అవసరం. అటువంటి సాధన చేసే పద్ధతులలో భగవన్నామం చేయటం ఒకటి. మహాత్ముల దర్శనం, వారి ప్రవచనం వినటం కూడా సాధన మార్గమే. విన్నది మెల్లగా మననానికి తెచ్చుకోవాలి. మనం ఏదైనా పనిని చేయవలసి ఉంటే దానిని గురించి అనేక విధాలుగా, ఎన్నో రకాలుగా, ఎన్నోసార్లు దాని గురించి ఆలోచిస్తాం. అలాగే విన్న విషయాన్ని పదేపదే మననం చేసుకుంటే మనస్సుకు హత్తుకుని, సాధన మార్గంవైపు తీసుకువెళ్తుంది. శనగ గింజని పంచదార పానకంలో నానవేస్తే అది తీపినే సంతరించుకుంటుంది. వేపరసంలో నానవేస్తే చేదునే సంతరించుకుంటుంది. ఆవకాయలో నానవేస్తే ఆవకాయ రుచినే సంతరించుకుంటుంది. మనం కూడా నిరంతరం భగవన్నామంలో ఓలలాడితే మనం కూడా ఆ రూపాన్నే పొందుతాం.

భగవంతుడు ఒక్కడే. భగవన్నామం చేస్తే మనకి కావలసినంత శక్తి వస్తుంది. పసిబాలుడు తప్పటడుగులు వేయగా వేయగా ఎలా నడక వస్తుందో అలా భగవన్నామం వినగా వినగా, ఆ వినికిడితో అప్రయత్నంగా శ్రుతి కలుస్తుంది. సరియైన సాధన చేస్తే మనం ఏదీ కోరకుండానే మనకు కావలసినది భగవంతుడు ఇస్తాడు.

భగవన్నామం అందరూ చేయాలి. దీనికి జాతి, వర్ణాశ్రమ భేదాలు పెద్ద సంకెళ్ళు. శ్రీ ఆదిశంకరాచార్యుల వారి సమయం నుంచే ఈ భేద భావం ఉంది. మహాత్ములు ఇటువంటి భేదం పాటించరాదని ఎంత చెప్పినా ప్రజలలో భేదభావం పోవటం లేదు. మనలో ఆ భేద భావం పోవాలి. పిల్లలికి మనం ఏం నేర్పిస్తున్నాము? పూర్వజన్మల వాసనలతో ముందుగా 'తాత, అమ్మ, అక్క, అత్త, నాన్న' అని నేర్పిస్తున్నాము. ఇవి పలుకగలిగినవాడు 'రామా' అనలేడా? తప్పక అనగలడు. పిల్లలతో భగవన్నామం అనిపించాలి.

- సశేషం

# హనుమద్వైభవము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

దాసోఽ హం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః।
హనుమాన్ శత్రుసైన్యాన్ నిహంత మారుతాత్మజ్ఞః।



ఈ శ్లోకము హనుమంతుని దాసభక్తికి, వినయ విధేయతలకు, నిగర్వమునకు ఆత్మస్థైర్యానికి ప్రత్యక్ష నిదర్శనము. ఓరాక్షసులారా! నేనెవరినని ప్రశ్నిస్తున్నారా? నేను కౌసలేంద్రుడు, పరమ పవిత్రుడైన శ్రీరామచంద్ర ప్రభువునకు దాసానుదాసుడను నాపేరు హనుమంతుడు. నేను వాయు పుత్రుడను, శత్రువులను రూపుమాపుటకే యిచ్చటకు వచ్చాను' అని చెప్పాడు.

శత్రువుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించి, అజేయుడైన అంజనా తనయుడు, తాను శ్రీరామచంద్రుని దాసానుదాసుడనని చెప్పుకొనుటలో, అతని వినయము, దాసభక్తి శిఖరాగ్రము చేరుకొన్నాడు. తనను గురించి పరిచయం చేసుకోవటంలోని వరుసక్రమంలో ప్రభుభక్తికి ప్రధమ స్థానం ఇచ్చాడు. ఆలా నిరాభిమానము, నిరహంకారము, వినయనాది శీలసంపద హనుమకు సహజభూషణములు. శత్రువు యొక్క సత్తాను చక్కగా బేరీజువేసుకున్నాడు. తనకు శత్రువులైనా, తన్ను సంహరించటానికి సంసిద్ధులైనా, వారి ప్రతిభనుగ్రహించి, మెచ్చుకొన్న సహృదయుడు, సాధుశీలి, తనతో సమరానికి తలపడ్డ, అక్షయ కుమారుని రావణాసురుని పుత్రుడు యొక్క ప్రతిభను చూసి ఇలా ప్రశంసించాడు.....

అయం మహోత్మాచ మహీంశ్చ వీర్వత :
సమాహికశ్చాతి సహోశ్చ సంయుగే
అసంశయం కర్మ గుణోదయా దయం
సనాగయక్షైర్మునిభిశ్చ పూజితః॥

ఇతడు మిక్కిలి బుద్ధిశాలి, మహావీరుడు, ఏకాగ్రమనస్కుడు, యుద్ధశ్రమలకు తట్టుకొనగలవాడు కార్యసామర్థ్యమును బట్టి నిస్సంశయంగా నాగులు. యక్షులు, మునులు మొదలగు వారి

ప్రశంసలకు పాత్రుడై యుండవచ్చునని హనుమ అక్షయ కుమారుని బలపరాక్రమములను మెచ్చుకొన్నాడు. అలాగే రావణాసురుని చూసి తనకు శత్రువైనా సహృదయంతో ప్రశంసించాడు.

అహో! రూమమమహో ధైర్యమ్ అహోసత్వమహోద్యుతిః

అహోరాక్షస రాజస్య సర్వలక్షణ యుక్తతా!

అంటే - రావణుని రూపము అత్యద్భుతము. ధైర్యము నిరుపమానము. ఆయన సత్త్వము తేజస్సు కడుప్రశంసనీయము. ఈ రాక్షసరాజు సర్వ లక్షణ శోభితుడు.

హనుమ లంకలో చేయవలసిన సాహస కార్యాలన్నీ చేసి, కిష్కింధకు తిరిగివచ్చి, 'చూచితిని సీతమ్మను' దృష్ట్వా సీతా అనే శుభ వార్తను శ్రీరామచంద్ర ప్రభువుకు అందజేస్తాడు. సీతామాత క్షేమవార్త నందజేయటంలో ఎంతో బుద్ధి కౌశల్యం వాక్చాతుర్యాన్ని హనుమ ప్రదర్శించాడు. ఎంతో ఆతురతతో ఎదురు చూసే వ్యక్తికి అతి క్లుప్తమైన మాటలతో ప్రశస్తమైన విషయాన్ని వెల్లడి చేయటం పవనసుతుని ప్రతిభాపాటవమునకు ప్రత్యక్ష నిదర్శనం.

సంగ్రామమునకు సన్నద్ధులై వానర సైన్యము బయలు దేరుతుంది. సాగరాన్ని దాటి లంకానగరం వెలుపల రామలక్ష్మణులు వానర సైన్యంతో యుద్ధ వ్యూహాన్ని ఆలోచిస్తుండగా విభీషణుడు శ్రీరామ చంద్రుని శరణుకోరి వస్తాడు. అప్పుడు వానర ప్రముఖులు శత్రుపక్షము వ్యక్తికి శరణమివ్వటం శ్రేయస్కరం కాదేమో యిక్కడి గుట్టుమట్లు తన అన్నగారైన రావణాసురుడికి అందజేయవచ్చుననే సందేహం వ్యక్తం చేశారు. అప్పుడు రాముడు స్వయంగా లంకకు వెళ్ళి అందరి వ్యక్తుల మనస్తత్వాన్ని నిశితంగా పరీక్షించిన హనుమ సలహా అడుగుతాడు. వెంటనే హనుమ విభీషణుడు సత్వగుణ సంపన్నుడనీ, మనస్ఫూర్తిగా శ్రీరామ ప్రభువు శరణు కోరుతున్నాడని, శిబిర రహస్యాలను అందజేసే కుటిల మనస్తత్వం లేదని హామీ ఇచ్చాడు. కాకపోతే కాస్తంత రాజ్యకాంక్ష ఉన్నదని ఎలాగైనా వాలిని సంహరించి, తన ప్రాపుకోరిన సుగ్రీవుని కిష్కింధరాజ్యమునకు ప్రభువును చేసినట్లు, తనను కూడా లంకా రాజ్యమునకు ప్రభువును చేయవచ్చనే అంతర్లీనమైన కోరిక ఉండ వచ్చునని చెప్పాడు. ఇక్కడ మారుతి నిశితమైన మనస్తత్వ ప్రావీణ్యత తెలుస్తోంది మనకు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

- విజయేశ్వరానంద ప్రసాద్

## నిండ్రకోలను డాక్టరుగారితో శ్రీబాబు

"నాయనా! అచిర కాలంలోనే శ్రీరామ చంద్ర ప్రభువు ఒక బాలుని రూపంలో నీకు దర్శనం ఇస్తాడు. బ్రహ్మతేజస్సుతో ఉట్టిపడే ఆ బాలుని మాటలు నంగిగా ఉంటాయి. కాని అది చూసి నీవు సామాన్య బాలుడని మోసపోకు. అతడు నిరంతర కాళీనామ జపధ్యాన లగ్నచిత్తుడై, రామ నామామృత రసాస్వాదనలో సహజసమాధి స్థితుడై ఉంటాడు. ఆ బాలుడి కనులు విస్ఫులింగాలవలె వెలుగుతూ ఉంటాయి. చూడ్కులుతీక్షణంగా, ఎదుటివారి హృదయ అంతరాళంలోకి చొచ్చుకుపోయేలా ఉంటాయి. ప్రథమ దర్శనం లోనే నీవు ఆ బాలునిలో నీ ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్ర ప్రభువును గుర్తించగలవు. అనన్య దృష్టితో నీవు ఆ మహనీయుని ఆశ్రయించి, నీ జన్మను చరితార్థం చేసుకో"



నిరంతర భగవత్సాక్షాత్కారం కోసం కొప్పెర్ల వెంకటరాజుగారు పొందే తీవ్ర పరితామును, చేసే ఏకాగ్రమైన ధ్యాన నిష్ఠను గుర్తించి, మహనీయులైన పండిత నరసింహరాజుగారు వారికి మంత్రదీక్షను ప్రసాదిస్తూ అన్న మాటలివి.

దిరుసుమర్రు గ్రామంలో జన్మించిన శ్రీ కొప్పెర్ల వెంకటరాజుగారు బాల్యంలోనే భగవద్భక్తులై నిరంతర భగవన్నామ చింతనలో ఉండేవారు. పూర్వజన్మల స్మృతి కలిగినవారై ఈ జన్మమే తమకు కడసారి జన్మ కావాలని కృతనిశ్చయులైనారు. కామినీకాంచనముల పట్ల నిరాసక్తులు, అయిదేండ్ల ప్రాయంలోనే తమ మొలనున్న వెండి మొలత్రాడును ఒక ఎద్దు మెడకు అలంకరించి, నందీశ్వరుడని నమస్కరించారు. తనకు తినమని పెట్టిన తినుబండారాలను చెరువులోని జీవులకు వేసి, అవి తింటుంటే, తాము తింటున్నట్లుగా ఆనందించిన దివ్య ప్రేమశీలురు. ఉండ్రాళ్ళను తినమని

ఇస్తే మైలురాయిని చూసి అదే వినాయకుడని భావించి నివేదన చేసుకున్నారు.

అవధూత మాచమ్మగారు "నాయనా ప్రహ్లాదా! శ్రీమన్నారాయణ మూర్తిని ఒక బాలుని రూపంలో నీవు దర్శించబోతున్నావు!" అని దీవించారు.

ఇలా చిన్నతనంలోనే మహాత్ముల ఆశీస్సులను అందుకున్న వెంకట రాజుగారు తమ ఆరాధ్యదైవమైన 'ఆ బాలరాముడు! ఆ నారాయణమూర్తి!' తనకు దర్శనమిచ్చే దివ్యక్షణం కోసం అనుక్షణం ఎదురు చూశారు.

ఆ దివ్యక్షణం రానే వచ్చింది. అది ఒక మహత్తర క్షణం! ఆ సమయంలో ఒక చిన్న అరణ్యంలో వెంకటరాజుగారు ధ్యాననిష్ఠలో ఉన్నారు. తమకెదురుగా ఉన్న చెట్టుమీద తేజోవంతుడైన బాలుడు ధ్యాన ముద్రలో ఉన్నట్లుగా వారికి గోచరించింది. కనులు తెరచి చూసిన వెంకటరాజుగారికి, పండిత నరసింహరాజుగారు వర్ణించిన పోలికలతో ఆ బాలుడు కనిపించటంతో, ఆ బాలుడే తన ఆరాధ్యదైవమైన శ్రీరామ చంద్ర ప్రభువని గుర్తించారు. వెంకటరాజుగారు వెంటనే తన ఆరాధ్య దైవం పట్ల తన కర్తవ్యాన్ని గుర్తించి, ఆ బాలుడి ధ్యానానికి ఎటువంటి భంగం వాటిల్లకుండా జాగ్రత వహించారు. ఆ బాలుడు (శ్రీబాబు) వెంకట రాజుగారి భక్తితత్పరమైన సేవకు ప్రసన్నులైనారు.

ఇలా కొన్నాళ్ళు ప్రతిరోజూ శ్రీబాబుకు వెంకటరాజుగారు సేవ చేసుకున్నారు. తన ఆరాధ్యమూర్తి తనకు దర్శనమిచ్చి తన సేవలను అందుకున్నందుకు వెంకటరాజుగారు తమ జన్మసాఫల్యమైనట్లు ఆనందించారు. ఆ విధంగా రాజుగారు శ్రీబాబుకు అత్యంత సన్నిహిత శిష్యులు అయ్యారు.

వెంకటరాజుగారు వృత్తిరీత్యా వైద్యులు. ఆయన హస్తవాసి అమోఘమైనది. ఎంతటి తీవ్ర వ్యాధి అయినా క్షణాలలో లొంగిపోయేది. వైద్యంకోసం వచ్చినవాళ్ళందరికీ చికిత్సచేస్తూనే, ఆయన భగవద్విషయాలు చెబుతూ, శ్రీబాబు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడని, వారిని నమ్ముకోండి అని బోధించేవారు.

- సశేషం

-గత సంచిక తరువాయి

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

కబీరుకు వివాహం చేయాలని తల్లి నిశ్చయించింది. కబీర్ ఎంత వారించినా లాభం లేకుండా పోయింది. “లోయీ”అనే యువతితో కబీర్‌కు వివాహం అయింది. కబీరు వివాహితుడైనా అతనిలో జ్ఞానతృష్ణ తగ్గలేదు. భగవదనుభూతికై ఆరాట పడసాగాడు. కబీర్ మహమ్మదీయుడని హైందవ గురువులు అతనిని శిష్యుడుగా స్వీకరించలేదు. కబీర్ ప్రవర్తన ఖురాన్ ప్రవచనాలకు విరుద్ధంగా ఉందని మహమ్మదీయ గురువులు అతనికి విజ్ఞాన బోధ మేము చేయమని చెప్పారు. లోపల పెల్లుబికి వచ్చే వేదనను గేయ రూపంలో గానం చేశాడు కబీర్.



కౌన్ బతావే బాట్? గురుబిన్ బడా వికట్ యమఘాట్ ॥కౌన్॥
కామక్రోధ్ దో పర్వత ఠాడే, లోభ చోర సంఘాత్ ॥కౌన్॥
మదమత్సర కా మేహ బరసాత్,మాయా పవన్ బహే దాట్ ॥కౌన్॥
కహత్ కబీర్ సునో బాయి సాధో,కస్ తరనా యహ ఘాట్ ॥కౌన్॥

“యమపాశం భయంకరమైనది. కామ క్రోధములనే పర్వతాలు అడ్డుగా నిలచి జీవన నౌకాయానమును నిరోధించుచున్నవి. మరో తీరం చేరాలంటే అచట దోచుకొనటానికి లోభం సిద్ధంగా ఉన్నది. మద మాత్సర్యాలనే వర్షపు జల్లు నౌకపై పడుతోంది. మాయా గాలులు వీస్తున్నాయి. ఇట్టి పరిస్థితులలో గురువు తప్ప కరుణించి కాపాడేది ఎవరు?” అని దుఃఖిస్తూ నడుస్తున్నాడు. నిరాశ నిస్పృహలు ఆవరించాయి. నీరసించిపోయాడు. గంగాతీరంలో మెట్లపై పడిపోయాడు.

బ్రహ్మముహూర్త కాలం సమీపిస్తున్నది. పవిత్ర గంగానదిలో స్నానం చేయటానికి రామానందస్వామి వస్తున్నాడు. మసక చీకటిలో ఆయన పాదం అక్కడ మెట్ల మీద నిదురిస్తున్న కబీర్ మస్తకంపై పడింది. “రామ్” అని ఉచ్చరించాడు. కబీరు పులకాంకితుడై లేచి రామానందస్వామి

పాదాలపై పడి "మహాత్మా! ఆ అమృత వాక్యానికై ఎదురుచూస్తున్నాను. మీరే నా గురువులు. మీ పాదాల చెంత నా జన్మ ధన్యం చేసుకుంటాను" అన్నాడు. శ్రీరామనందుల వారి పాదం తన తలపై పడి ఆయన "శ్రీరామ" అన్న దానినే తారక మంత్రోపదేశంగా గ్రహించిన కబీర్ ఒకరోజున అంగడివీధిలో "శ్రీరామానంద స్వామి నాకు శ్రీరామ తారక నామం ఉపదేశించారు" అని నృత్యం చేస్తూ రామనామం చేయసాగాడు. కొందరు అసూయాగ్రస్తులైన బ్రాహ్మణులు ఈ సంగతి శ్రీరామానందుల వారికి తెలిపారు. ఆయన కబీర్ వద్దకు వచ్చి తన మనస్సులోని శిష్య వాత్సల్యాన్ని పైకి కనపడనీయకుండా, "ఓరీ! నీకు నేను ఉపదేశం చేశానని అబద్ధం ఆడతావా? నేను నీకు ఉపదేశం చేసినట్లు సాక్షి ఎవరు?" అంటూ అటు బ్రాహ్మణులకు ఆనందం కలిగేటట్లుగా కబీర్ శిరస్సుపై పాదుకతో కొట్టారు. కబీర్ శిరస్సుకు గాయం అయి రక్తం ధారగా ప్రవహించసాగింది. అయినా కబీర్ ఆనంద భరితుడై "నన్నేలు దేశికోత్తమా! దేవర వారు శ్రీరామ తారకము ఉపదేశించినప్పుడు సర్వేశ్వరుడు ఒక్కడే సాక్షి. ఇప్పుడు అందరూ చూస్తుండగా దేవరవారు తమ పాదుకలను నా శిరస్సుపై ఉంచారు. ఇంతకన్నా ఏం కావాలి? జనులారా! నాకు పరమ కృపతో శ్రీరామ తారకాన్ని ఇచ్చిన మహానుభావులు వీరే!" అని ఎలుగెత్తి చాటాడు.

శ్రీరామానందులు ఎంతో సంతోషించి "సాధుజనాగ్రేస్వరా! ఎడతెగని శ్రీరామతారక నామోచ్చారణ చేస్తూ ఉండు" అని కబీర్‌ను ఆజ్ఞాపించి తన నివాసానికి వెళ్ళిపోయారు. రామానందుడు అతడిని ఆశీర్వదించి తన శిష్యునిగా స్వీకరించాడు. ఆతని హృదయమంతా ప్రేమ జల్లుతో నిండిపోయింది. గురుకృపతో అహంకారం సమూలంగా నశించింది. ఆనాటి నుంచి రామ నామమును ఆశ్రయించి కబీర్‌దాస్ అనే నామంతో పిలువబడేవాడు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL